మహిళలు ఆర్థికాభివృద్ధికి పోస్టల్ ఖాతాలు తప్పనిసరి

విశాలాంధ్ర - వల్లూరు : మహిళలు ఆర్థికంగా నిలబడాలంటే పోస్టల్ ఖాతాలు తప్పనిసరి అని ప్రొద్దుటూరు పోస్టల్ సబ్ డివిజనల్ అధికారి సుశీల్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వల్లూరు పోస్ట్ ఆఫీస్ నందు స్థానిక పోస్టల్ సిబ్బంది బిపిఎంలో, ఈడీఎంలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పోస్ట్ ఆఫీస్ ఉన్నాయని తమ గ్రామ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి మహిళా సమ్మన్ సేవింగ్ సర్టిఫికెట్ గురించి ప్రతి ఒక్క మహిళకు తెలియ జేయా లన్నారు. ఈ మంచి సువర్ణ అవకాశం అన్నారు. మీ పరిధిలో ఖాతాల ను తెరిపించాల్సిన బాధ్యత మీ పై ఉందన్నారు. 1000 రూ కనీసం డిపాజిట్లు నుంచి 200000 లక్షల గరిష్ట డిపాజిట్ చేయవచ్చు అన్నారు. అత్యధిక వడ్డీ 7.5 అందిస్తున్నామన్నారు కాల వ్యవధిలో రెండు సంవత్సరాల వరకు ఒక వేల ఆరునెల ఖాతాను ముగించుకుంటే 5.5 వడ్డీ మొత్తాన్ని అందజేస్తామన్నారు. గ్రామ పరిధిలో సమావేశాలు పెట్టి ఖాతాలను తెరిపించాలన్నారు ఈ కార్యక్రమంలో పోస్టుమాస్టర్ రమాదేవి ,ఎంఎల్ఓ భాస్కర్, తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

శాంతంగా ఉన్న వారే జీవితంలో ఏదైనా సాధించవచ్చు: ఎంపీపీ

విశాలాంధ్ర - చెన్నూరు : ప్రశాంతమైన జీవితానికి మనసును శరీరాన్ని స్థిరంగా ఉంచుకోవడం చాలా ముఖ్యమని, యోగా వలన స్థిరమైన ఆలోచన మానసిక శారీరక ఆరోగ్యం సాధ్యమవుతుందని, ఏకాగ్రత పెరిగే కొద్దీ ఎక్కువ జ్ఞానాన్ని ఆర్జించ వచ్చని, జ్ఞాన సమపార్జనకు మార్గం యోగానే అని ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ యోగా దినోత్సవము సందర్భంగా చెన్నూరు పంచాయతీ కార్యాలయం ఆవరణములో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ యోగ దినచర్యగా చేసుకోవాలని యోగ వలన అనేక లాభాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్ బాబు, డీఎల్పీఓ మస్తాన్ వలి, పంచాయతీ సెక్రటరీ రామసుబ్బారెడ్డి, సచివాలయం కన్వీనర్ శ్రీనివాసరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

విశాలాంధ్ర - వల్లూరు : విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థాయికి చేరు తారని డీఈఓ రాఘవరెడ్డి అన్నారు. బుధవారం ఆదర్శ పాఠశాలను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు సకాలంలో జగనన్న విద్యార్థి దీవెన కిట్లు అందజేయాలన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బక్రీద్‌కు వసతులు కల్పించాలి

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: బక్రీద్ పండుగ సంధర్భంగా ఈద్గాలో ప్రత్యేక వసతులు కల్పించాలని అంజుమన్ కమిటి ప్రెసిడెంట్ బొల్లవరం బాషా, కౌన్సిలర్లు ఖలీల్, మహమ్మద్ గౌస్‌లు మున్సిపల్ వైస్‌చైర్మెన్ బంగారురెడ్డికి వినతిపత్రం అందచేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఈద్గాలో నమాజు చదువుకునేందు కు షామియాన, మంచినీరు, కూలర్ల వసతి కల్పించాలని కోరారు. గత సంవత్సరం బక్రీద్ పండుగకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారని ఇప్పుడు కూడ అలాగే అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. సానుకూలంగా స్పందించిన వైస్‌చైర్మెన్ బంగారురెడ్డి ఎమ్మెల్యే రాచమల్లు దృష్టికి తీసుకువెళ్లి అన్ని ఏర్పాట్లు తప్పకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ముస్లింలు సంతోషంగా పండుగ జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా మైనార్టీ నాయకులు వడ్ల దాదాపీర్, హిదాయత్, నూరి, అంజుమన్ కమిటీ జాయింట్ సెక్రటరీ బాబా పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండల కేంద్ర పరిధిలోని గురుకుల పాఠశాల సమీపంలో ఉన్న ఈశ్వరిదేవి గృహం వద్ద గుర్తు తెలియని వృద్ధుడు వయస్సు 65సంవత్సరాలు ఉంటాయని తహసీల్దార్‌కు వచ్చిన సమాచారం మేరకు స్థానిక పోలీసులు, పంచాయతీ సిబ్బంది అక్కడికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించిగా, మృతదేహం దుర్వాసనతో అంతా చెడిపోయింది. కనీసం ఆధారాలు కూడ ఏమి లేవని పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ రావు తెలిపారు. అధికారుల ఆదేశాలతో మృతదేహానికి అక్కడే పంచనామాలు చేసి దహణసంస్కారాలు చేసినట్లుగా వారు తెలిపారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

అంధకారంలో వెంకటాపురం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : మండల పరిధిలోని పి.వెంకటా పురం గ్రామంలోని పలు వీధులు బుధవా రం విద్యుత్ సరఫరాలో అవాంతరం ఏర్పడి అంధకారం నెలకొంది. ఇందుకు సంబందిం చిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం ఉద యం సుమారు 8 గంటల ప్రాంతం లో టిప్పర్ వాహనం కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను తాకడంతో అక్కడి ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్థంభం పూర్తిగా నేలకొరిగాయి. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం తృటిలో తప్పింది. విద్యుత్ సరఫరాకు పూర్తి అవాంతరం ఏర్పడింది. సదరు వాహన యజమానితో చర్చలు జరిపి నష్టపరిహారం తంతును ఆ శాఖ యంత్రాంగం ముగించుకున్నట్లు సమాచారం. కాగా ప్రమాదం ఉదయం జరిగినప్పటికీ ఇప్పటి వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సంబంధిత శాఖ యంత్రాంగం చర్యలకు ఉపక్రమించకపోవడం పట్ల గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంటు లేని కారణంగా గ్రామంలోని పలు వీధులు అంధకారంతో నిండుకొని చిన్నారులు, వృద్ధులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సహజంగా ఇలాంటి సందర్భాలలోయుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడం సంప్రదాయం. లేనిపక్షంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపడుతారు. కానీ ప్రస్తుతం ఇక్కడ అలాంటి చర్యలు కనిపించడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో అంధకారం నెలకొందని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ చౌర్యంపై దిద్దుబాటుకు యత్నం

రాత్రి సమయాల్లో టెప్ప - పగటివేళల్లో తనిఖీలు- నవ్విపోతున్న జనం

విశాలాంధ్ర-యర్రగుంట్ల : ఎర్రగుంట్ల ప్రాంతంలోని నాపరాయి గనుల్లో యధేచ్ఛగా కొనసాగుతున్న విద్యుత్ చౌర్యంపై దిద్దుబాటు చర్యలకు ఆ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు ప్రారంభించారు. విశాలాంధ్ర దినపత్రిక కథనాలపై స్పందించిన యంత్రాంగం మంగళవారం నాపరాయి గనులను తనిఖీ చేసిన సంగతి తెలిసిందే. అయితే విద్యుత్ చౌర్యం రాత్రి సమయాల్లో కొనసాగుతున్న విషయం సంబంధిత అధికారులకు తెలిసినప్పటికీ వారు పగలు దాడులు నిర్వహించడంపై ఈ ప్రాంత జనం నవ్విపోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. వ్యాధి ఒకటైతే మందు మరొకటి అన్నట్లుగా చౌర్యాన్ని సమర్థవంతంగా అరికట్టాలన్న తపన సదరు యంత్రాంగంలో కనిపించడం లేదనేందుకు పగటివేళ దాడులే నిదర్శనమని చెప్పవచ్చు. గత కొన్నేళ్లుగా కొందరు యజమానులు ఈ దోపిడీకి యధేచ్ఛగా పాల్పడుతున్నప్పటికీ స్పందించని ఆ శాఖఅధికారులు పత్రికల్లో కథనాలు రాగానే తగుదునమ్మా అంటూ మొక్కుబడి కార్యక్రమాలకు తెరలేపారు. అందులో భాగంగా దాడులకు శ్రీకారం చుట్టారు. కొండను తవ్వి ఎలుకను సైతం పట్టలేకపోయారన్నట్లు గా విద్యుత్ శాఖ తనిఖీలు కొనసాగాయని నాపరాయి కార్మికులే బాహాటంగా వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం.

చౌర్యంపై నిరంతర నిఘా - డీఈ శ్రీనివాసులు రెడ్డి: నాపరాయి గనుల యజమానులు, లీజుదారులతో బుధవారం స్థానిక వేంపల్లి రోడ్డులోని ట్రాన్స్‌కో కార్యాలయ ఆవరణంలో సమావేశాన్ని ఆ శాఖ అధికారులు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ప్రొద్దుటూరు డివిజనల్ అధికారి శ్రీనివాసులు రెడ్డి విద్యుత్ చౌర్యంపై హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది. ఇకపై నిరంతర నిఘా ఉంటుం దని, తరచూ దాడులు కొనసాగుతాయని, ఎవరైనా పట్టు బడితే రూ.లక్షల్లో జరిమానాలు విధిస్తామని ఆయన హెచ్చరించినట్లు సమాచారం. నిబంధనల మేరకే గనుల యజమానులు విద్యుత్‌ను వినియోగించుకోవాలే తప్ప చౌర్యానికి పాల్పడరాదని హితబోధ చేసినట్లు సమాచారం. సదరు మీటర్లకు సరఫరా అయిన విద్యుత్ యూనిట్ల గణాంకాలను పరిగణలోకి తీసుకుంటామని వివరించినట్లు తెలుస్తోంది. సరఫరా, వాడకంలో వ్యత్యాస వివరాలు ఆన్‌లైన్ ద్వారా సీఎండీ నుండి ముఖ్యమంత్రి వరకు తెలుసుకొనే వీలుందని ఆయన గుర్తు చేసినట్లు సమాచారం. విద్యుత్ సరఫరాలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావడం ద్వారా వాటిని పరిష్కరించుకోవచ్చునని ఆయన సూచించినట్లు తెలుస్తోంది. దాడుల సమయంలో జరిమానాలు విధించిన పిదప తాము చేయగలిగిందేమీ ఉండదని తేల్చిచెప్పినట్లు సమాచారం. తప్పులను తాము ఉపేక్షించబోమని హెచ్చరించినట్లు తెలిసింది. మొత్తంగా విద్యుత్ చౌర్యంపై అధికారులలో కదలికవచ్చిందని చెప్పవచ్చు. ఈ విషయంలో తూతూమంత్రంగా కాకుండా నిక్కచ్చిగా వ్యవహరిస్తారో లేదో వేచిచూడాలి. కాగా ఈ సమావేశంలో స్థానిక అధికారులు నరసింహారెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : శ్రీ కోదండరామాలయం, హౌసింగ్ బోర్డు కాలనీ కడప నందు రామాలయ సేవా సమితి, ఆరోగ్య భారతి, కడప వారు సంయుక్తంగా బుధవారం ఉదయం 6-30 గంటలకు అంతర్జాతీయ యోగా దినోత్సవమును ఆలయ ధర్మకర్త డి. వెంకట్ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమము ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సనాతన సంస్కృతి జీవన విధానంలో యోగా ఒక భాగమని అన్నారు. ప్రతి రోజు యోగచేయడం వలన షుగర్ బి.పిని కంట్రోల్ ఉంచుకోవచ్చని తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ యోగసాధన మరియు ధ్యానం చేయుట ద్వారా ఆరోగ్యముతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని వివరించారు. తర్వాత ఆరోగ్య భారతి కడప ప్రముఖ్ ఇ.కృష్ణారెడ్డి యోగాసన కార్యక్రమము వామప్ క్రియలతో ప్రారంభించారు. తర్వాత ఆరోగ్య భారతి గౌరవ అధ్యక్షురాలు కళావతి ఆసన, ప్రాణాయామ క్రియలను సాధకులు అందరిచేత చేయించారు. ఈ కార్యక్రమములో గీతా జ్ఞాన ప్రచారకులు ఎ.ముకుంద రెడ్డి, ఆలయ పెద్దలు ఎన్.చెన్న కృష్ణారెడ్డి, మల్లికార్జున రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సుబ్బారెడ్డి, విశ్వనాథ రెడ్డి సత్యవతమ్మ, మంజుల ఆరోగ్య భారతి ప్రముఖ్ నారయ్య, రాయలసీమ టూరిజం కల్చరల్ సొసైటి ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు, సుమారు 60 మంది యోగసాధకులు పాల్గొని సభను జయప్రదం చేశారు.

యోగాతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం వారి ఆధ్వర్యంలో ప్రపంచ యోగా 9 వ దినోత్సవాన్ని కళాశాల క్రీడా ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యువ యోగా గురువులు సి.ధరణి కుమార్, స్వామి వివేకానంద కేంద్రం (కడప) శ్రీ సాయి క్రిష్ణ నాగార్జున స్కూల్ (కడప) వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు వారి యొక్క దైనందిన జీవిత కాలంలో యోగా సాధన చేయాలనీ, యోగా సాధన చేయడం వలన మానవునిలో అనేక రుగ్మతల నుండి విముక్తి పొందవచ్చు నని, 2023 యోగా దినోత్సవం ముఖ్య నినాదం వైదవ్ కుటుంభం అంటే భూమి నా ఇళ్లు అని యోగా అనేది భారతదేశ ప్రాచీన సాంప్రదాయానికి అమూల్య మైనదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివిఎస్ఎస్ మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పీ.ప్రేమ్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు, ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయ కర్త జె.సురేష్ బాబు, బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు కలిపి 500 మంది పాల్గొన్నారు.

విద్యార్థుల మేధస్సు పెంచేందుకు క్విజ్ పోటీలు

విశాలాంధ్ర- ఒంటిమిట్ట : విద్యార్థుల మేధస్సు పెంచేందుకు క్విజ్ పోటీలు దోహదం చేస్తాయని ఒంటివిట్ట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ కవిత అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒంటిమిట్ట స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ వారు మండల స్థాయిలో ఆల్ ఇండియా క్విజ్ కాంపిటీషన్ కార్యక్రమాన్ని బుధవారం ఒంటిమిట్ట ఎంఆర్సి కార్యాలయంలో నిర్వహించా రు. మండల స్థాయిలోని 8, 9 మరియు పదవ తరగతి చదువుతున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయిలో ఆలిండియా ఆర్బీఐ స్కూల్ క్విజ్ 2023 నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒంటిమిట్ట మండల విద్యాశాఖ అధికారులు జి.వెంకటసుబ్బయ్య మరియు డి.ప్రభాకర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఒంటిమిట్ట మండల పరిధిలోని ఉన్నత పాఠశాలల నుండి విద్యార్థులు క్విజ్ కాంపిటీషన్లో పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్త మాధవరం కు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలచగా మండపంపల్లి, ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశామని వారు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ క్విజ్ నందు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో నిలిచిన స్కూళ్ల విద్యార్థులకు ఈ నెల 28న జిల్లాస్థాయి క్విజ్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జూలై నెలలో రాష్ట్ర స్థాయి, రాష్ట్రస్థాయి తర్వాత జాతీయస్థాయిలో ఆర్బీఐ ఆధ్వర్యంలో క్విజ్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర- ఒంటిమిట్ట : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమౌతోందని, యోగా ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం అని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొత్త మాధవరం ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవర ణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులచే యోగా కార్యక్రమం నిర్వహిం చారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు యోగా ఆసనాల గురించి వివరించారు. యోగాను జీవితం లో భాగస్వామ్యం చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కండరాలు వ్యాకోచం చెంది రక్త ప్రసరణ బాగా జరుగుతుందన్నారు. మనిషిలో ఏకాగ్రత పెరగడం తోపాటు ఆలోచనా శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులను పర్యవేక్షించిన జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు నియోజిక వర్గంలోని పెన్నానదిపై నిర్మాణం చేపడుతున్న బ్రిడ్జి పనులను జాయింట్ కలెక్టర్ గణేష్, జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులను నాణ్యతగా చేపట్టాలని, బ్రిడ్జి నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి భూములు ఎన్ని ఎకరాలు పోతుందో, అందులో ప్రభుత్వ, ప్రైవేటు, ఫారెస్ట్ భూమి ఎంత ఉందో అన్న వివరాలను జాయింట్ కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

మున్సిపల్ మెయిన్ స్కూల్‌ను తనిఖీ చేసిన కమీషనర్

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : నగరపాలక సంస్థ కమీషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ ఐఏఎస్ మార్నింగ్ విజిట్ లో భాగంగా మున్సిపల్ మెయిన్ స్కూల్ ఆకస్మిక తనిఖీ చేశారు. అందులో భాగంగా ముందుగా పాఠశాల నందు ప్రధాన ఉపాధ్యాయురాలు వద్ద నుండి అక్కడి ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల యొక్క హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం పాఠశాలల నందు ఉన్న ప్రతి ఒక్క తరగతి గదిలో పరిశీలించి అక్కడ విద్యాబోధన యొక్క షెడ్యూల్ యొక్క వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠాలు బోధించు షెడ్యూల్ నందు పలు మార్పులను సూచించారు. నూతనంగా ఇచ్చినటు వంటి ప్రభుత్వ తరగతి పుస్తకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ స్కూల్ విద్యార్థులం దరూ కూడా వారి పాటలనందు చురుకుగా ఉంటూ పాస్ పర్సంటేజ్ నందు పురోగతి ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు.

యోగ ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర- పోరుమామిళ్ల: యోగా ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని రంగసముద్రం సర్పం చ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన యోగ దినోత్సవ వేడుకలలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్ రెడ్డి, బ్రహ్మకుమారి సమాజ సిబ్బంది మల్లిక, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, స్పెషలాఫీసర్ చంద్రశేఖర్, ఎంపీడీఓ మౌళేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయ సుబ్బారెడ్డి, మండల ఉపాధ్యక్షులు సి.బాషా, రాజశేఖర్, గిరి ప్రణీత్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుండే మానసిక ఒత్తిడిని తగ్గించుకొని యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలన్నారు.యోగా శరీరాన్ని, మెదడును, మానవత్వాన్ని, ప్రకృతిని కలుపుతుందని, యోగా ఒత్తిడిని తగ్గిస్తుందని, మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తుందని, క్రమ శిక్షణ నేర్పిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ప్రతి రోజూ ఓ గంటపాటు యోగా సాధన చేయాలన్నారు. బ్రహ్మకుమారి సభ్యులు యోగ ఆసనాలు వేసి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజీవ్ రెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల : బి.కోడూరు ప్రాధమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని 10 సచివాలయాల పరిధిలో ప్రపంచయోగ దినోత్సవ కార్యక్రమంలో భాగముగా యోగ కార్యక్రమాలు సిహెచ్‌ఓల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని బి.కోడూర్ ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు వినీత్ కుమార్ రాజు, ఉదయకిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో వైద్యాధికారులతో పాటు, సిహెచ్‌ఓలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగమణి, మండల ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, ఆరోగ్య పర్యవేక్షకులు విలియం విజయలక్ష్మి, వైద్య సిబ్బంది, అంగన్వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్పంచ్ పేరు లేకపోవడం సరికాదు

విశాలాంధ్ర- మదనపల్లి: మదనపల్లి రూరల్ మండలం చీకల బైలు గ్రామ పంచాయతీ సచివాలయం ప్రారంభోత్సవ శిలాఫలకంలో సర్పంచ్ పేరు లేక పోవడం, సమాచారం ఇవ్వకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘము రాష్ట్ర కోర్ కమిటీ అధ్యక్షులు నాగినేని గోవిందు తీవ్రంగా ఖండించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోవిందు మాటాడుతూ చీకలబైలు సర్పంచ్‌కు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. బీసీ లకు పెద్ద పీఠ వేస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం అన్యాయం చేస్తున్నారని విమర్శలు గుప్పించారు. వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నాగినేని గోవిందు, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మన్న, జిల్లా కార్యదర్శి చెన్నం వెంకటరమణ, కొల్లబైలు గ్రామ గౌరవ అధ్యక్షులు కొత్తురీ చిన్న రెడ్డప్ప, వాల్మీకి బోయ సంఘం పెద్దలు మేకల చంద్రశేఖర్, మేకల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర- వేంపల్లె: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఆయుష్షు లభిస్తుందని ప్రిన్సిపల్ చెరసాల యోగాంజనేయులు పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారంగా స్థానిక వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత మూడు రోజుల నుండి ఎన్ఎస్ఎస్ యూనిట్ , డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో యోగా మీద శిక్షణ ఇస్తూ బుధవారం ఇంటర్నేషనల్ యోగ డే సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చెరసాల యోగాంజనేయులు మాట్లాడుతూ .శారీరకంగా మానసికంగా దృఢమైన చిత్తానికి యోగాభ్యాసం సులభమైన సాధనమన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 200 మంది విద్యార్థినీ విద్యార్థులు వివిధ యోగాసనాలను ప్రదర్శించారని ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ ఓబుల్ రెడ్డి తెలిపారు. వివిధ రకాల వ్యాసరచన పోటీలు ,వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర యోగా ముద్రలను గురించి వాటి లాభాలను విపులంగా వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శంకరమ్మ , సీహెచ్ఓ కళావతి , వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర ,ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ ఓబుల్ రెడ్డి ,మల్లేశ్వరమ్మ , కళాశాల అధ్యాపక అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో: వేంపల్లె మండల పరిధిలోని ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటరు కోటేశ్వరి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. యోగా వల్ల కలిగే ప్రయోజ నాలు తదితర అంశాలను కోటేశ్వరి విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవరచుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఫైనాన్స్ అధికాకి దినేష్‌కుమార్, సీనియర్ ఆఫీసరు హృషికేశరెడ్డి, శంషాద్‌బేగం, ఓబయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

జెఎన్‌టియు కళాశాలలో: పులివెందుల ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా యోగా గురువు పి.వెంకట్రామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా మన శరీరం గురించి నేర్పుతుందని, అలాగే యోగా బాగా శ్వాస తీసుకోవడం ఎలాగో నేర్పుతుందన్నారు. యోగా మన శక్తిని మరింత సమర్థవంతంగా ఎలా ఉపయోగించా లో కూడా తెలియజేస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి, కో ఆర్డినేటరు మనీషా, అధ్యాపక,అధ్యాపకేత్ర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తొండూరులో: తొండూరు పంచాయతీ పరిధిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుష్ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, స్నేహిత అమృత హస్తం సేవాసమితిల సంయుక్త ఆధ్వర్యంలో యోగా గురువు ఓమ్ ప్రకాష్ ఆధ్వర్యంలో యోగా సనాలు వేయించారు. ప్రిన్సిపల్ తులశమ్మ, డాక్టర్ నాగముని నాయక్ , ఉషారాణి, ఆయుష్ వైద్యులు డాక్టర్ నాగముని, డాక్టర్ ముక్తార్ అహమ్మద్, డాక్టర్ వైద్యనాథ్, ప్రాథమిక వైద్యాశాల వైద్యులు డాక్టర్ ఆరిఫ్ ఉల్లా, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో: లయోలా పాలిటెక్నిక్ కళాశాలలో గురువు ఓం ప్రకాష్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ బబ్రిట్టో చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రిన్సిపల్ మాట్లాడు తూ ప్రతి ఒక్కరు నిత్యం యోగా చేయడం అలవరచుకోవాల న్నారు. యోగా తోనే మానసిక ప్రశాంతత, శారీరక వ్యాయామం జరుగుతుందన్నారు. నిత్య జీవితంలో ప్రతి విద్యార్థిని యోగా చేయడం అలవరచుకుని ఆరోగ్యంగా ఉంటూ విద్య లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. యోగా గురువు ఓమ్ ప్రకాష్ యోగా ఆసనాలు, ప్రాణాయామం అంశాల గురించి వివరించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - కమలాపురం : నగరంలోని సిఎస్ఎస్ఆర్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ సి.వి. రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా(ఇంటర్నేషనల్) దినోత్స వాన్ని ఆ కళాశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యోగా ఆసనాల వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగాఉండగలరని అన్నారు. ప్రపంచ దేశాలలో భారతదేశం యొక్క కీర్తి ద్విగిణీకృతం అయిందని. తెలిపారు వైస్ ప్రిన్సిపాల్ డా.పల్లా కృష్ణ మాట్లాడుతూ దైనందిన జీవితంలో యోగా నిత్య కృత్యం కావాలని అప్పుడే ప్రతి మనిషి ఎటువంటి రోగాల బారిన పడకుండా సంపూర్ణ ఆరోగ్య వంతుడు గా జీవించడం జరుగుతుంది అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్. అశోక్ కుమార్ విద్యార్థులకు యోగా విశిష్టత తెలుపుతూ వారితో కొన్ని ఆసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి లెఫ్టినెంట్ పి. ప్రదీప్ కుమార్, సి.అయ్యవారు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి ని కలిసిన చర్చి ఫాదర్

విశాలాంధ్ర-గుర్రంకొండ: చర్చి ఫాదర్ మరియు అన్నమయ్య జిల్లా వైయస్సార్ పార్టీ అధ్యక్షులు జాన్ బాబు త్వరలో క్రిస్టియన్ వైఎస్ ఆర్ పార్టీ అనుబంధ విభాగాలు ఏర్పాటు చేస్తున్నట్లు బుధవారం ఆయన తెలిపారు ఇందులో భాగంగా ఎంపీ జాతీయ వైఎస్ఆర్ పార్టీ అనుబంధ విభాగాల కోఆర్డినేటర్ కలిసి 15 రోజు లోపల అన్నమయ్య జిల్లా క్రైస్తవ అనుబంధ విభాగాల కమిటీ ఏర్పాటు చేయాలని సూచించినట్లు తెలిపారు జిల్లాలో ఉన్న శాసనసభలు మరియు ఎంపీ మిథున్ రెడ్డి మరియు జోనల్ ఇంచార్జ్ రామచంద్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గారిని కలిసి వారితో చర్చించినట్లు ఆయన తియజేశారు.

విశాలాంధ్ర
వైఎస్ఆర్ కడప జిల్లా



కలెక్టర్‌ను కలిసిన ఏ.పి.యన్.జి.వో నాయకులు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న 63 మంది ఏ.యన్.యమ్.లను డెప్యూటేషన్‌పై దూరప్రాంతలకు వేయడంపై గౌరవ కడప కలెక్టర్ విజయరామరాజుని కలిసిన యన్. జి. వో జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు, కార్యదర్శి డి. రవికుమార్, సిటీ అధ్యక్షులు చిన్నయ్య, కార్యదర్శి సైలేశ్వర్ రెడ్డి డెప్యూటేషన్ క్యాన్సల్ చేయమని అడిగారు. కలెక్టర్ మాట్లాడుతూ చాలా తక్కువ వర్క్ చేసిన ఉన్న వారిని కొద్దికాలం ఉంచి, మిగిలిన వారిని వారి ప్రాంతాల కు పంపిస్తానని ఈరోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో మాట్లాడుతానన్నారు. అలాగే కొంతకాలంగా వీరపునాయనిపల్లి వైద్య అధికారి, సిబ్బంది మధ్య సమస్యను పరిష్కరించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో విచారణ పూర్తి చేసి చర్యలు చేపడుతామన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ శ్రీనివాస్ నాయక్

విశాలాంధ్ర-కడప : కడప నగర శివార్లోని ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) లో అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ గా డాక్టర్ శ్రీనివాస్ నాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు.వారు మాట్లాడుతూ నేను ప్రస్తుతం ఫోరెన్సిక్ మెడిసిన విభాగాధిపతిగా పనిచేస్తున్నాను. 1996 మెడికల్ ఆఫీసర్‌గా గడివేముల పిహెచ్‌సిగా బాధ్యతలు చేపట్టాను. 2002 డివిజనల్ టిబి కంట్రోల్ ఆఫీసర్ గా నంద్యాలలో 2008 వరుకు పనిచేశాను. 2008 నుంచి 2015 వరుకు అసిస్టెంట్ ప్రొఫెస్సర్ గా కర్నూల్ వైద్య కళాశాలలో పనిచేశాను. 2015 నుంచి 2020 వరుకు అసోసియేట్ ప్రొఫీసర్ గా అనంతపురం మెడికల్ కాలేజ్ లో పని చేశాను.2020 లో పదోన్నతిపై ప్రొఫెస్సర్‌గా కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతిగా వచ్చాను. 23 సంవత్సరాల విధి నిర్వహణలో ఇప్పటి వరకు ఎటువంటి రిమార్క్ లేదన్నారు. వైస్ ప్రిన్సిపాల్ బాధ్యతలు చేపట్టిన నేను, ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో వైద్య విద్యను, మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తూ, వైద్య విద్యార్థులకు వైద్య విద్యను అభ్యసించేంచేందుకు అన్ని రకాల సౌకర్యాలు మరియు సదుపాయాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తానన్నారు. వైస్ ప్రిన్సిపాల్ గా భాద్యతలు చేపట్టినందుకు వైద్య కళాశాల లోని సహచర హెచో ఓడిలు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారని పేర్కొన్నారు.

24 నుండి జిల్లా స్థాయి శిక్షణా తరగతులు

సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

విశాలాంధ్ర-కడప రూరల్ : ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలపై భవిష్యత్ కర్తవ్యాన్ని రూపొందించుకునే క్రమంలో కడప జిల్లా సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా స్థాయి శిక్షణా తరగతులు ఈనెల 24, 25, 26 తేదీలలో వి.యన్.పల్లిలో జరగనున్నాయనీ సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. బుధవారం స్థానిక హెూచిమిన్ భవన్ యందు సిపిఐ నగర కార్యవర్గ సమావేశం దస్తగిరి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్ర మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో సీపీఐ అగ్రభాగాన నిలిచి పోరాడిన, స్వాతంత్ర్యానంతరం రాజభరణాల రద్దు, బ్యాంక్ జాతీయీకరణ, భూసంస్కరణ చట్టం అమలు కొరకు పట్టుబట్టి వాటిని సాధించింది. ప్రభుత్వ రంగ సంస్థలు నెలకొల్పేందుకు అనేక పోరాటాలు నిర్వహించింది. దేశ సార్వభౌమాధికారాన్ని, మత సామరస్యతను, లౌకిక వాదాన్ని పరిరక్షించడంలో రాజీలేని పోరాటాలు నిర్వహించిందన్నారు. దేశంలో నేడు నెలకొన్న ఫాసిస్ట్ ధోరణుల మీద, ఆర్థిక - సామాజిక అంశాలపై నిరంతరం పోరాడుతున్నదనీ అన్నారు. కేంద్రంలో రెండవసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలకు తిలోదకాలిచ్చి నిరంకుశ పాలన సాగిస్తున్నారని నల్లధనం వెలికితీత, ఏడాదికి కోటి ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యారని ఆరోపించారు. ముస్లిం మైనారిటీలను టార్గెట్ చేస్తూ సిపిఏ, ఎన్.ఆర్.సి.ఎన్.పి.ఆర్ తెచ్చి వెనక్కి తగ్గి, కార్మికవర్గం పోరాడి సాధించుకున్న పనిగంటలు, హక్కులను కాలరాస్తూ కార్పోరేట్ కంపెనీల దోపిడీకి ద్వారాలు తెరుస్తూ చట్టాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్ముతూ చివరకు మన విశాఖ ఉక్కును కూడా ప్రవేటు పరం చేయడానికి పూనుకున్నది. పెట్రోల్, డీజల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ బాధ్యతనుండి పూర్తిగా తప్పుకుని ప్రజల రక్తమాంసాలను పీల్చి పిప్పిచేస్తున్నది గుర్తు చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరానికి నిధులు కేటాయించడంలో, కడపలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటులో ఘోరమైన నిర్లక్ష్యం చేస్తున్నది. మూడనమ్మకాలపై పోరాటం చేస్తున్న గౌరీలంకేష్, దబోల్కర్ లాంటి వారిని పొట్టనపెట్టుకొని ప్రజా ఉద్యమాలపై పోరాటం చేస్తున్న హరగోపాల్ లాంటి నాయకులపై దేశద్రోహం కేసు పెట్టి పెట్టిన ఘనత బిజెపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

జాతీయ విద్యా విధానం పేరుతో శాస్త్రీయ విద్యను చరిత్ర పాఠాలను పూర్తిగా తొలగించి భావకల్పిత భావాలను చొప్పించే చర్యలకు పాల్పడుతున్నదని, దేవుని పేరుతో దేశభక్తి పేరుతో ప్రజలమధ్య వైషమ్యాలను రెచ్చగొట్టి తద్వారా రాజకీయ లబ్ధిపొందాలని చూస్తున్న బిజెపి ప్రభుత్వ చర్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజా సమస్యలపై ప్రజల గొంతుకై సిపిఐ పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయి రాజకీయ విద్య వైద్యానికి శిక్షణ తరగతులు జరుగుతున్నాయని జిల్లాలోని సిపిఐ శ్రేణులు సుమారు 300 మంది ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొనున్నట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు, నగర కార్యదర్శి ఎన్.వెంకట శివ, సహాయ కార్యదర్శి కే.సి.బాదుల్లా, నగర కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మి, గంగాసురేష్, ఓబయ్య ,నాగరాజు,మునయ్య, బ్రహ్మం, ఆర్ బాబు, నాయక్,నాగరాజు, నాగిరెడ్డి, మైనుద్దీన్, భాగ్యలక్ష్మి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలకు ఎంపికలు

విశాలాంధ్ర - చెన్నూరు : మండలంలోని కొండపేట గ్రామములోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి మరియు జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపికలు మండల విద్యా శాఖధికారి షర్మిలా రాణి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ పాల్గొన్నారు. క్రీడా పాఠశాల ఎంపిక కార్యక్రమంలో 4వ తరగతి విభాగంలో మద్దెల లోహిత మరియు పైడి కాల్వ శ్రావణ్, మొపూరి వెంకట్, నవీన్ లు 5వ తరగతి విభాగంలో ఊటుకూరు అక్షిత మరియు బూసగాని నాగమునీశ్వర్, ఓంకార్‌లు ఎంపిక అయ్యారు. కో ఆర్డినేటర్లుగా రామనపల్లి, చెన్నూరు మరియు కొండపేట పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులు వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో కొండపేట సర్పంచ్ తుంగా చంద్రా యాదవ్, ఎంపీటీసీ నాగిరెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమిష్టిగా పని చేయాలి

విశాలాంధ్ర వల్లూరు : ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు సమిష్టి కృషితో పనిచేసినప్పుడే విద్యార్థుల ఉత్తీర్ణత స్థాయి పెరుగుతుందని వల్లూరు ఎంఈఓ-2 విజయ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విజయ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సకాలం లో పాఠశాలకు హాజరుకావాలని ప్రభుత్వ పథకాలు ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేటర్ స్థాయి విద్యను అందించినప్పుడే విద్యార్థితో తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలపై మక్కువ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లిల్లెమ్మ, ఉపాధ్యాయులు,ఎంఆర్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సాయి హైస్కూల్‌లో యోగా దినోత్సవం

విశాలాంధ్ర-సిద్దవటం : సిద్దవటం బ్రాహ్మణ వీధిలోని శ్రీ సాయి హై స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా వివిధ రకాల ఆసనాలను వేయించారు. ప్రతిరోజు యోగా చేయడం వలన మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, చురుకుదనం, ఉల్లాసంగా ఉంటారని పాఠశాల కరస్పాండెంట్ పోలు వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రేవతి దేవి తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులకు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు గ్రామ ప్రజలకు యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

'భవిష్యత్‌కు గ్యారెంటీ'పై దిశానిర్దేశం శ్రేణులతో 'భూపేష్' భేటీ

విశాలాంధ్ర-యర్రగుంట్ల : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన భవిష్యత్‌కు గ్యారెంటీ, మినీ మేనిఫెస్టో అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా జరుగనున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని జమ్మలమడుగు అసెంబ్లీ నియోజకవర్గ ఆ పార్టీ ఇన్‌చార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు.రాబోవు రోజుల్లో అనుసరించాల్సిన విధి విధానాలపై ఆయన సుదీర్ఘంగా సమాలోచనలు చేశారు. ఇటీవల పార్టీ చేపట్టిన అన్ని కార్యక్రమాలకు ప్రజల నుండి సంపూర్ణ మద్దతు లభిస్తున్న నేపథ్యంలో శ్రేణులు మరింత ఉత్సాహంతో జనం మధ్యకు వెళ్లాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆయా కార్యక్రమాలలోని అంశాలను జనం మధ్య విస్తృత ప్రచారం చేపట్టాలని ఆయన దిశ నిర్దేశం చేశారు.

ఇంటర్ అడ్మిషన్ల కోసం విస్తృత ప్రచారం

విశాలాంధ్ర-వేంపల్లె: వేంపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల కోసం పలువురు అధ్యాపకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ప్రత్యేకించి ప్రభుత్వ జూనియర్ కళాశాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ కళాశాలలో చేర్పించాంటూ తెలుగు అధ్యాపకులు చెరుకూరు శ్రీనివాసులు బుధవారం పలు ప్రాంతాలల్లో ప్రచారం చేశారు. విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలంటూ విద్యార్థినిల తల్లిదండ్రులకు కరపత్రాలను అందజేశారు. అలాగే ప్రభుత్వ కళాశాల లో విద్యాబోధన, వసతలు తదితర అంశాలను ఆయన వివరించారు. కార్పోరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్య లభిస్తుందన్నారు. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అక్రమ ఇసుక తరలింపుపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - వల్లూరు : అక్రమ ఇసుక తరలింపు పై చర్యలు తీసుకోవాలని వల్లూరు మండల తహసిల్దార్ శంకర్రావు కు, ఎస్ఐ పెద్ద ఓబన్నకు టిడిపి నాయకులతో కలిసి మండల టిడిపి ఇన్చార్జ్ లేబాక నాగేశ్వర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. బుధవారం మండల కేంద్రంలోని కమలాపురం నియోజవర్గం ఇంచార్జ్ పూతా నర్సింహారెడ్డి ఆదేశాల మేరకు ఆదినిమ్మయపల్లి పెన్నా నదిలో జరుగుతున్న అక్రమ ఇసుక తరలింపు ఆపాలంటూ టిడిపి నాయకులు తహసిల్దార్ ఎస్సై కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఇసుక వారికి అనుమతులు లేకపోయినా రాత్రి టిప్పర్లు ఇసుకను తరలిస్తున్నారని ఈ అక్రమ తరలింపుపై అధికారులు చర్యలు తీసుకోవాలంటూ వినతిపత్రం అందజేశామన్నారు. అక్రమ తరలింపు పై అధికారులు చర్యలు తీసుకోకుంటే మా నాయకుడు పుత్తా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో తామే అడ్డుకుంటా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు తాడిగొట్ల రాఘవరెడ్డి గడికోట సుధాకర్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, చిట్టిబాబు, నాగ సుబ్బారెడ్డి , ఓబులేష్ యాదవ్, సద్దాం హుస్సేన్, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థలను సీజ్ చేయాలి: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-కడప రూరల్ : కడప నగరంలోని నారాయణ విద్యాసంస్థ వద్ద అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి. వలరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 17 తారీకు నుండి 20, 24 వరకు పాఠశాలలు ఎండ తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం వరకే పాఠశాల నిర్వహించాలని ప్రభుత్వం ఇది వరకే సర్క్యులర్ జారీచేసిన ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు కడప జిల్లా వ్యాప్తంగా ఎక్కడా కూడా పాటించడం లేదని కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల కబంధహస్తాల్లో ఉన్న డీఈవో ఎంఈఓ విద్యాశాఖ అధికారులు నిద్రావస్థ నుండి మేల్కొని ప్రభుత్వ నిబంధన ఖాతర చేయని విద్యాసంస్థలకు షోకాస్ నోటీసులు ఇచ్చి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. కడప నగరంలోని నారాయణ శ్రీ చైతన్య ప్రైవేటు విద్యా సంస్థ ప్రైవేటు పాఠశాలలో పూర్తిస్థాయిలో పాఠశాల నిర్వహిస్తున్న విద్యార్థులను వేడికి కారాగారంలో లాగా రోజువారి కూలీలుగా మార్చుతున్న మానసిక స్థితిగతులను అంచనా వేయకుండా పూర్తిగా పాఠశాల నిర్వహిస్తూ వేధిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని లేకపోతే అఖిల భారత విద్యార్థి సమాఖ్య విద్యార్థి యొక్క తల్లిదండ్రులు కలిసి డీఈఓ కార్యాలయం ఎదుట బైఠాయించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష కార్యదర్శులు బి. అరుణ్, కే. శివశంకర్, లీలాధర్, పవనేశ్వర్, అకిరానంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

విశాలాంధ్ర- యర్రగుంట్ల : గత నాలుగేళ్ల వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని అధికార వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. షాహీద్ పేర్కొన్నారు. బుధవారం ఆయన పార్టీ కార్యాల యం లో విలేకరులతో మాట్లాడుతూ తాజాగా ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ సిలబస్ ప్రవేశపెట్టబోతున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం హర్షనీయమన్నారు. ఇంటర్నేషనల్ బ్యాకలోరియట్ (ఐబీ) ద్వారా విద్యార్థులపై పరీక్షల ఒత్తిడిని తగ్గించేందుకు వీలవుతుందన్నారు. 19ఏళ్ల లోపు విద్యార్థులకు క్రిటికల్ థింకింగ్ సెల్ఫ్ లెర్నింగ్, కమ్యునికేషన్ స్కిల్స్‌లో తర్ఫీదునిస్తారని ఆయన వివరించారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని ప్రాముఖ్యతనిస్తోందని ఆయన గుర్తుచేశారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర - మైదుకూరు : భారతీయ జనతా పార్టీ మైదుకూరు నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొమ్మిది సంవత్సరాల కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం ఈరోజు మైదుకూరు నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాచనూరు సుబ్బరాయుడు మైదుకూరు మండల అధ్యక్షుడు రామకృష్ణ, యోగా మాస్టర్ వెంకటసుబ్బయ్య, రాజమోహన్, దేవేంద్ర, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

లా కమిషన్ తిరస్కరించిన 'ఉమ్మడి పౌరస్మృతి'పై బిజెపి కుట్ర

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : భారతదేశంలో విభిన్న సంస్కృతులు, ఆచార వ్యవహారాలు అమల్లో ఉండగా కొన్ని సమూహాలు లేదా బలహీన వర్గాల సమాజానికి సంబంధించిన విశేషాదికారాల ప్రక్రియ తొలగింపు సరి కాదు. అత్యంత క్లిష్టమైన ఈ తీర్మానం ద్వారా అన్ని వ్యత్యాసాలను రద్దు చేయలేము. అందువల్ల ఈ కమిషన్, శాసనాల్లో వ్యత్యాసం ఉన్నప్పటికీ "భారతదేశానికి ఉమ్మడి పౌరస్మృతి అవసరం లేదు లేదా వాంఛనీయం కాదు" అని 21వ లా కమిషన్ ఆగస్టు నెల 31, 2018 వ సంవత్సరంలో ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ వివరించారు. ఈ విధంగా ఉమ్మడి పౌర స్మృతిని 21వ లా కమిషన్ తిరస్కరించగా కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం తిరిగి ఇదే అంశాన్ని 22వ లా కమిషన్ ద్వారా అమలు చేసేందుకు మహా కుట్ర పన్ని నట్లు ఆయన ఆరోపించారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకసారి భారత దేశ న్యాయాధికార సంస్థ పరిపూర్ణంగా యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు అవసరం లేదా వాంఛనీయం కాదని విస్పష్టంగా ఆదేశాలు ఇచ్చిన వెంటనే ఆదేశాలు అమల్లోకి వచ్చాయన్నారు. అయినప్పటికీ తిరిగి ఉమ్మడి పౌరస్మృతి అమలుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత సమాజంపై మరోసారి మహా కుట్ర చేయడం అత్యంత దారుణమని విమర్శించారు . ఇదివరకే జాతీయ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి పౌరస్మృతి అమలు సాధ్యం కాదని స్పష్టం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కడప జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర- సిద్దవటం : సిద్ధవటం మండలం మాధవరం గ్రామ పంచాయతీలో శ్రీ కనకదుర్గ కళ్యాణ మండపం నందు గురువారం చేనేత సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు మేడా వెంకట మల్లికార్జున రెడ్డి ఆంధ్రప్రదేశ్ పద్మశాలి వెల్ఫేర్ అండ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ జింక విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను తెలుసుకునేందుకు తమరి వద్దకే సీఎం తనను పంపించడం జరిగిందన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. పార్టీలకతీతంగా ప్రజలకు సేవ చేసుకుంటూ తాను ముందుకెళ్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. జూలై 23వ తేదీన వైఎస్ఆర్ సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు. గత ప్రభుత్వాలు చేయని విధంగా జగన్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను ప్రవేశపెడుతుందన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో సభావేదికపై రాజంపేట శాసనసభ్యులు మేడా వెంకట మల్లికార్జున్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ పద్మశాలి వెల్ఫేర్ చైర్ పర్సన్ జింక విజయలక్ష్మికి శాలువాతో పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి సర్పంచులు ఎంపీటీసీలు మరియు ముఖ్య నాయకులు, సిద్ధవటం, ఒంటిమిట్ట మండలాలలోని చేనేత కార్మికులు, చేనేత సహకార సంఘాల యొక్క ప్రెసిడెంట్స్, మాస్టర్ వీవర్స్, సచివాలయ సిబ్బంది వాలంటీర్స్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల బాదుడుపై సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: విద్యుత్ చార్జీల బాదుడుపై సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదిన వామపక్షాలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో కూడిన అఖిల పక్షం ఆధ్వర్యంలో స్థానిక పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడ విద్యుత్ బిల్లులు పెంచుతున్నారని, అలాగే వ్యవసాయానికి విద్యుత్ మీటర్లు, స్లాబ్ సిస్టం పేరుతో వ్యాపార, వాణిజ్య వర్గాల వారిని దోపిడికి దిగుతున్న పాలకుల తీరును నిరసిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశం జరుపుతున్నామని, కావున 23వ తేదిన ఉదయం 10గంటలకు అన్ని వర్గాలవారు, సంఘాల వారు విరివిగా హాజరుకావాలని బి.రామయ్య తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి షరీఫ్, సమితి సభ్యులు వై.హరిలు పాల్గొన్నారు.

ఆర్పీపీఈ కళాశాలలో ఘనంగా యోగా దినోత్సవం

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: రాయలసీమ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఆర్సీపీఈ) కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కళాశాలలో విద్యార్థిణి, విద్యార్థులు యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్సీపీఈ కళాశాల చైర్మెన్ లక్ష్మికాంతమ్మ మాట్లాడుతూ యోగా అనేది మనలో అంతర్లీనంగా ఉండే శక్తిని సమతుల్యమైన పద్ధతిలో మెరుగుపరుచుకోవడానికి ఉపకరించే ఒక క్రమశిక్షణ వంటిదని పేర్కొన్నారు. కాలక్రమేనా స్వయం అనుభూతిని సాధించుకోవడా నికి ఇది ఒక మార్గం చూపిస్తుందన్నారు. రిటైర్డ్ ఇంజనీర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ మనిషిని పరిపూర్ణ ఆరోగ్యవంతుడిని చేసేది యోగా అని అన్నారు. మన పూర్వికులు మనకు అందించిన అద్భుతమైన సంపద యోగా అని తెలిపారు. ఈ కార్యక్రమం లో అనురాధ, కళాశాల ప్రిన్సిపల్ రశిశంకర్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

బెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డు అందుకున్న ఉమర్

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో వరల్డ్ బ్లడ్ డోనార్స్ డే సంధర్భంగా రాజుపాళెం మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ బ్లడ్ డోనార్స్ ఫౌండేషన్, స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ ఉమర్ బ్లడ్ బ్యాంక్ డా.కవిత చేతులమీదుగా బెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డును అందుకున్నారు. ఫ్రెండ్స్ బ్లడ్ బోనర్స్ ఫౌండేషన్ ద్వారా దాదాపు 3సంవత్సరాలుగా 700మందికి రక్తదానం చేయించి, అలాగే సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ ఉమర్ 30సార్లు రక్తదానం చేసినందుకు గాను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది ఆయన సేవలను గుర్తించి అవార్డును అందించారు. ఈ సంధర్భంగా మహమ్మద్ ఉమర్ మాట్లాడుతూ ఒక్క వ్యక్తి రక్తదానం చేస్తే ముగ్గురికి ప్రాణదానం చేసినట్లే అన్నారు. రక్తం కొరత వల్ల చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారని, అటువంటి వారికి రక్తదాతలు ఇచ్చే రక్తం సంజీవని అన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యం మరింత మెరుగ్గా ఉంటుందని ఆయన తెలిపారు. రక్తదానం చేస్తే జీవితకాలంలో ఎప్పుడు కూడ గుండెపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులు రావు అని అన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఆయన పేర్కొన్నారు. అవార్డు అందించిన డా.కవితకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్స్ రామకృష్ణ, మహేష్, సూరజ్, సిస్టర్ హరికుమారి పాల్గొన్నారు.

బి.మఠం తహసీల్దార్‌గా సువర్ణదేవి బాధ్యతలు

విశాలాంధ్ర-బ్రహ్మంగారి మఠం: మండలంలోని రెవెన్యూ కార్యాలయానికి తహసీల్దార్‌గా సువర్ణ దేవి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గత రెండు నెలలుగా తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఈశ్వరయ్యను జమ్మలమడుగు తహసీల్దార్‌గా బదిలీ చేయడంతో ఆయన స్థానానికి నంద్యాల జిల్లా బనగానపల్లె నుండి బ్రహ్మంగారి మఠం తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తహసీల్దార్‌గా తను విధులు ప్రజల కోసం చేస్తానని. ప్రజలకు అందుబాటులో ఉంటూ భూ సమస్యలు కూడ పరిష్కరించే విధంగా తనవంతు కృషి చేస్తానని అన్నారు. బ్రహ్మంగారి మఠంలో అధికంగా భూసమస్యలు ఉన్నాయని సమస్యలు పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేదాస్ పాఠశాలలో ఘనంగా యోగా దినోత్సవం



విశాలాంధ్ర - కమలాపురం : నగరంలోని వేదాస్ (ప్రైవేటు) పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని ఆ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు వసుంధర దేవి ఆధ్వర్యం లో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు యోగ ఆసనాలు యోగ చేయడం వలన కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల విద్యార్థులు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ నీటి పారుదల సంస్థ:: కడప విభాగం

షార్ట్ టెండరు ప్రకటన

టెండర్ నోటీసు : 05/ఇఇ/ఆర్‌ఐసి/ కెడిపి/ 2023-24 తేది: 21-06-2023

వైఎస్ఆర్ జిల్లా యందు 31.10 లక్షల అంచనా విలువ గల వివిధ గ్రాంట్స్ క్రింద మంజూరు అయిన 4 పనుల కొరకు సీలు వేసిన టెండర్లు కోరబడుతున్నవి. టెండరు షెడ్యూలు దరఖాస్తు చివరి తేది 24.06.2023 టెండరు స్వీకరణకు చివరి తేది: 28.06.2023 మ॥ 3.30 గంటల వరకు .

మిగతా వివరములకు కార్యాలయ పనివేళ యందు సంప్రదించవలసినదిగా కోరడమైనది.

సం/- **కార్యనిర్వాహక ఇంజనీర్, కడప డివిజన్, కడప**

విశాలాంధ్ర



అన్నమయ్య జిల్లా

వర్షపు నీరు హరిజనవాడలోకి రాకుండా చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : ఓబులవారిపల్లిమండలంలోని గోవిందంపల్లి పంచాయతీలోని శంకరాపురం హరిజనవాడ గ్రామములోకి వర్షపు నీరు రాకుండా నివారణ చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య కార్యదర్శి కృష్ణవేణి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కొన్ని తరాల నుండి వర్షపు నీరు పోవడానికి తూము ఉండేదన్నారు. వర్షపు నీరు పోవడానికి దారి లేక హరిజనవాడ లోకి,పవిత్రమైన దేవాలయంలోనికి రావడం వలన తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వర్షపు నీరు పోవడానికి కాలువ ఏర్పాటు చేసి శంకరాపురం హరిజనవాడకు ఇబ్బందులు తొలగించాలని అధికారులను కోరారు. 2022లో భారీ వర్షాలు వచ్చిన సమయంలో వర్షపు నీరు అంతా శంకరాపురం హరిజనవాడలోకి దేవాలయములోకి వచ్చి ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొన్నామన్నారు. తాసిల్దారు, ఎంపిడిఓ, ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయికు వచ్చి పరిశీలించి వెళ్లారు. చేస్తాం పడతాం అంటున్నారే గాని ఇంతవరకు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. హరిజనవాడలు అంటే అధికారులు, ప్రజాప్రతినిధులు చిన్న చూపు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత వాడలలోనే ఎక్కువ సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించడంలో అధికారులు,ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించే వర్షపు నీరు హరిజనవాడలోకి దేవాలయం లోకి రాకుండా నివారణ చర్యలు తీసుకోకపోతే మహిళలు అందరం కలిసి వచ్చి సంబంధిత కార్యాలయాన్ని ముట్టడిస్తామని మహిళా సమాఖ్య వారు అధికారులను హెచ్చరించారు.

విద్యార్థుల మేధస్సు పెంచేందుకు క్విజ్ పోటీలు దోహదం చేస్తాయి

జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.వెంకటేశ్వర రెడ్డి

విశాలాంధ్ర - రాయచోటి : విద్యార్థుల మేధస్సు పెంచేందుకు క్విజ్ పోటీలు దోహదం చేస్తాయని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా 8, 9 మరియు పదవ తరగతి చదువుతున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయిలో ఆలిండియా ఆర్బీఐ స్కూల్ క్విజ్ 2023 నిర్వహించడం జరిగింది. మండల స్థాయి స్కూలు నందు ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన ఇద్దరు విద్యార్థులను ఒక టీముగా నిర్వహించడం జరిగింది. ఈ క్విజ్‌లో ప్రతిభ కనపరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో నిలిచిన స్కూళ్ల విద్యార్థులకు మొదటి బహుమతిగా 5వేల రూపాయలు, రెండవ బహుమతిగా 4వేల రూపాయలు, మూడో బహుమతిగా 3వేల రూపాయలు మరియు ప్రశంసా పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ క్విజ్ నందు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో నిలిచిన స్కూళ్ల విద్యార్థులకు ఈ నెల 28న జిల్లాస్థాయి క్విజ్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్నమయ్య జిల్లా డిఇఓ సహకారంతో ఈ మండల స్థాయి ప్రోగ్రాం విజయవంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

23న కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్:అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లో ఈనెల 23న కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎస్ అల్లా బకాష్ సి ఎల్ పి అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రేపు అనగా శుక్రవారం అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని పిజిఆర్‌గ్రాండ్ మదనపల్లి రోడ్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ,ఏఐసీసీ సెక్రటరీ మయ్యప్పన్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతం, మీడియా చైర్మెన్ తులసి రెడ్డి, హాజరవుతున్నారని ఉదయం 10గం లకి ప్రెస్ మీట్.10.30 కి.సమన్వయ కమిటీ సభ్యుల హాజరు.. సంతకాల సేకరణ.11 గం. నుండి 1గం వరకు సభ్యులతో సమావేశం.1గం. లకు.. భోజనాలు.2గం. నుండి 4గం వరకూ. పార్టీ అనుబంధ విభాగాల సమీక్ష సమావేశాలు నిర్వహిస్తారని ఆయన అన్నారు. కావున రాయచోటి నియోజకవర్గం లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అనుబంధ సంఘ సభ్యులు మహిళా సభ్యులు యువకులు ప్రతి ఒక్కరు హాజరై కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం:సాయి లోకేష్

విశాలాంధ్ర -రాజంపేట: యోగాతోనే పరిపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని బిజెపి రాష్ట్ర పొలిటికల్ ఫీడ్ బ్యాక్ కమిటీ సభ్యులు, రాజంపేట పార్లమెంటు కన్వీనర్ సాయి లోకేష్ తెలియజేశారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం తోట కళ్యాణమంటపంలో సాయి లోకేష్ ఆధ్వర్యంలో ప్రముఖ యోగ గురువు రెడ్డయ్య పర్యవేక్షణలో పట్టణ ప్రముఖులు మరియు ప్రజలకు వివిధ రకాల యోగాసనాలలో శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెనగలూరు మండలం కాకర్ల వారి పల్లెకు చెందిన మహిజ చేసిన యోగాసనాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సాయి లోకేష్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పాలనా పగ్గాలు చేపట్టాక సుపరిపాలన అందించడంతోపాటు ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న దృఢ సంకల్పంతో భారత్ లోనే కాక ప్రపంచ దేశాలలో సైతం యోగాను పరిచయం చేసి జూన్ 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి గుర్తించడం నరేంద్ర మోడీ కృషి యనలేనిది అని తెలిపారు. అనంతరం యోగ శిక్షకులు రెడ్డెయ్య, తోట కళ్యాణమండపం అధినేత రేవంత్, కుమారి మహిజ లను సాయి లోకేష్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది సురేష్ రాజు, మాజీ సర్పంచ్ తోట రామయ్య, రిటైర్డ్ ఇంజనీరింగ్ అధికారి రామకృష్ణమరాజు, గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు మస్తానయ్య, రాష్ట్ర మైనారిటీ మోర్చా నాయకులు షబ్బీర్ అహ్మద్, పంత్ ఎస్సీ నాయకులు కృష్ణయ్య, మహిళా మోర్చా నాయకురాలు సునీత నారాయణ వర్మ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్‌కు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్

విశాలాంధ్ర- మదనపల్లి: ఎడ్యుకేషన్(ఏ.ఐ.సి.టి.ఈ), న్యూ ఢిల్లీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్ ఎస్ మంథా కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకుల తో ఇంటరాక్షన్ సెషన్ ను నిర్వహించినారు. కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ కళాశాల ఎదుగుదల పరిశోధనలు, ప్లేసెమెంట్స్, ఇన్నోవేషన్స్ మొదలైన వాటిపై ఆధారపడి ఉంటుందని, ప్రతి అధ్యాపకుడు నూతన పరిశోధనలకు నాంది పలికి దేశ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. మిట్స్ కళాశాల నందు గల ల్యాబ్ లు, ఇంఫ్రాస్ట్రక్చర్, లైబ్రరి మొదలైనవి ఆయన సందర్శించారు. విదేశీ యూనివర్సిటీ సహకారంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడుతుందని, వారితో కలిసి పరిశోధనలు చేయాలని ఆయన అన్నారు. విద్యార్థులను ఇండస్ట్రీ రెడీ పద్ధతిలో వారిని నూతన టెక్నాలజీలకు పరిచయం చేయాలని అన్నారు. కళాశాలను ఒక యూనివర్సిటీ స్థాయి లో ఎదగడానికి ఇవన్నీ దోహద పడతాయని ఆయనన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. యువరాజ్, టి.జి. రవికుమార్, ప్రొఫెసర్ నారాయణన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్, డాక్టర్ కమల్ బాషా, విభాగాధిపతులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రదానం

విశాలాంధ్ర-గుర్రంకొండ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు నందు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినటువంటి క్విజ్ కార్యక్రమానికి మండలంలోని వివిధ పాఠశాల విద్యార్థులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. క్విజ్ ప్రోగ్రాం నందు గెలిచినటువంటి వారికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రోగ్రాం లో గెలిచిన ఉన్నత పాఠశాల తరిగొండ విద్యార్థులకు ప్రథమ బహుమతి బహుమతిగా 5000 రూపాయలు, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు బహుమతిగా నాలుగు వేల రూపాయలు, మర్రిపాడు ఉన్నత పాఠశాల తెలుగు తృతీయ బహుమతిగా 3000 రూపాయలు అందజేయడం జరిగింది. విద్యార్థుల ప్రోత్సహిస్తూ బ్యాంక్ మేనేజర్ రాఘవ రెడ్డి పార్టిసిపెంట్స్ అందరికీ ఒక జామెంట్రీ బాక్స్ ను అందజేశారు.

ఆయిల్ సీడ్‌ఫ్యాక్టరీ భూములు ఆక్రమణలకు గురి కాలేదు

విలేకరుల సమావేశంలో తాహాసిల్దార్

విశాలాంధ్ర-పీలేరు:- పీలేరు పట్టణంలోని తిరుపతి మార్గంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల నూనె విత్తుల కర్మాగారంలో ఉన్న భూములు మరియు వివిధ కారణాలవల్ల కర్మాగారం మూతపడడంతో ఆ భూములు గత కొన్ని సంవత్సరాలుగా అలానే ఉండిపోయాయని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు జగనన్న లేఅవుట్ల కోసం దరఖాస్తులు చేసుకోవడంతో ప్రభుత్వం గుర్తించి గత తాహాసిల్దార్ ఆ భూమిలో 721 మంది లబ్ధిదారులకు జగనన్న కాలనీకి కేటాయించడం జరిగిందని ఆయన స్పష్టం చేశారు. గత తాహాసిల్దార్ పొజిషన్ సర్టిఫికెట్ కూడా ఇవ్వడం జరిగిందని అందులో 9 మందికి లబ్ధిదారులకు జగనన్న కాలనీ తో పాటు వారికి పట్టాలు పొజిషన్ సర్టిఫికెట్లు కేటా యించడం జరిగిందని ఆయన విలేకరుల సమావేశంలో తెలిపారు.

సంతృప్తికర స్థాయి పెరిగేలా జగనన్నకు చెబుదాం అర్జీలను పరిష్కరించాలి

ఏపీ డెయిరీ డెవలప్ మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ అహ్మద్ బాబు

జగనన్న చెబుదాం కార్యక్రమాన్ని సీరియస్ గా తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్

విశాలాంధ్ర-మదనపల్లె రురల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "జగనన్నకు చెబుదాం" కార్యక్రమం ద్వారా ప్రజలలో సంతృప్తికర స్థాయి పెరిగేలా అర్జీలను పరిష్కరించాలని ఏపీ డెయిరీ డెవలప్ మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు అన్నమయ్య జిల్లా జగనన్నకు చెబుదాం కార్యక్రమం స్పెషల్ ఆఫీసర్, అహ్మద్ బాబు వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సభాభవనం నందు "జగనన్నకు చెబుదాం" కార్యక్రమం ద్వారా వివిధ శాఖలలో వచ్చిన అర్జీలపై జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ తో కలిసి ఏపీ డెయిరీ డెవలప్ మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు అన్నమయ్య జిల్లా "జగనన్నకు చెబుదాం" కార్యక్రమం స్పెషల్ ఆఫీసర్, అహ్మద్ బాబు అన్ని శాఖల హెచ్ఓడీలతో సమక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ డెయిరీ డెవలప్ మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు అన్నమయ్య జిల్లా "జగనన్నకు చెబుదాం" కార్యక్రమం స్పెషల్ ఆఫీసర్, అహ్మద్ బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారార్థం జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలన్నారు. బాధితుల అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా క్లియర్ చేయాలన్నారు. అర్జీలు పెండింగ్ ఉన్నట్లయితే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం అర్జీలను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించడం జరుగుతుందని ప్రతి అధికారి ఈ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకొని పనిచేయాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ముఖ్యంగా డ్రింకింగ్ వాటర్ భూమి సర్వే హద్దులు, కొలతలు, పట్టాదారు పాస్ పుస్తకాలు, అడంగల్, వన్ బి, తదితర సమస్యలపై అర్జీలు వస్తుంటాయని ఈ అర్జీలకు ఎప్పటికప్పుడు నిర్ణీత కాలవ్యవధిలోగా నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ గంగాధర్ రావు, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, మదనపల్లె, రాయచోటి, ఆర్డీవోలు మురళి, రంగస్వామి, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి సి.గురు ప్రకాష్ రావు, డిపిఓ ధనలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య, ల్యాండ్ అండ్ సర్వే ఏడి జయరాజ్, హౌసింగ్ పీడీ శివయ్య, డిఆర్ డిఎ పిడి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమమే టిడిపి ధ్యేయం:మాజీ ఎమ్మెల్యే రమేష్ రెడ్డి

విశాలాంధ్ర-గాలివీడు: రాష్ట్రంలోని మైనార్టీల సంక్షేమమే టిడిపి ప్రధాన ధ్యేయమని రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం ఆయన మండలంలోని నూలివీడు గ్రామపంచాయతీ నందు తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి రాష్ట్ర భవిష్యత్తు కు చంద్రబాబు గ్యారెంటీ , మన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ముస్లిం మైనార్టీలను ఉద్దేశించిన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రతి ఏడాది ముస్లిం మైనార్టీలకు కేటాయించిన బడ్జెట్ పూర్తి స్థాయిలో ఖర్చు చేసిందన్నారు.ప్రధానంగా ముస్లిం మైనారిటీలకు మసీదు నిర్మాణాలకు నిధులు అందచేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం పాలనలో అభివృద్ధి శూన్యం అని అరాచకాలు ,ఆగడాలు, దురాక్రమనలు తప్ప ప్రజలకు చేసింది శూన్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటనారాయణ రెడ్డి,రాష్ట్ర రైతు కార్యదర్శి వెంకటశివారెడ్డి, మాజీ ఎంపీటీసీ పార్వతమ్మ , మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు లక్ష్మయ్య సర్పంచ్ లు పార్థసారథి రెడ్డి , షబ్బీర్ భాష ,మహ్మద్ గౌస్ అమానుల్లా ,అజీజ్ ,కుమార్ నాయుడు, మాజీ సర్పంచులు మహమ్మద్ రియాజ్ ఈశ్వర్ రెడ్డి చిన్నపరెడ్డి ప్రభాకర్ నాయుడు ప్రభాకర్ రెడ్డి ,భద్రప్ప నాయుడు , మాజీ ఎంపీటీసీలు రెడ్డి ప్రసాద్ రెడ్డి ,వెంకటరమణ, రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకటసుబ్బారెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ సత్యరెడ్డి మాజీ వక్ఫ్ బోర్డు మెంబర్, మహబూబ్ బాషా,మాజీ వాటర్ షెడ్ చైర్మన్ రెడ్డి ప్రసాద్ రెడ్డి, టీడీపీ నాయకులు ప్రభాకర్ రెడ్డి ,వీరరాగవులు, ఒడ్డెప్పరెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,నాగేశ్వరరావు,ఐటీడీపి నాయకులు సాయి ప్రసాద్ రెడ్డి, జక్రియా, మైనారిటీ నాయకులు, అకౌంట్ భాష, టోపి వలి సాబ్, నూలివీడు గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధిస్తే మంచి భవిష్యత్తు

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : ఉత్తమ ఫలితాలు సాధిస్తేనే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు 2022 23 విద్యా సంవత్సరానికి 10వ తరగతిలో మండల స్థాయిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు మంగళవారం స్థానిక ఎస్సీ బాలల వసతి గృహంలో చదివిన ఆదిశంకర్ 553 ఏపీ మోడల్ స్కూల్ ఎస్సీ బాలికల వసతి గృహంలో రెడ్డి చరణ్య 579 కార్తికేయ 579 మార్కుల సాధించిన విద్యార్థులకు జాకీర్ హుస్సేన్ చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మెనూ ఛార్జీలు పెంచిందని విద్యార్థులు వసంత గృహాల్లో బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. గత ఏడాది ఒక్కొక్క విద్యార్థికి 1250 రూపాయలు ఉండేదని ఈ ఏడాది 1400 రూపాయలు చార్జీలు పెంచామన్నారు. అలాగే ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు 10 రకాల విద్యా సామాగ్రిని అందజేశామన్నారు. జగనన్న విద్యా కానుక జగనన్న వసతి దీవెన జగనన్న విద్యా దీవెన విద్యార్థుల ఖాతాలో జమైందన్నారు. ఈ ఏడాది నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉదయం సాయంత్రం వేళల్లో ప్రత్యేకత నిర్వహిస్తామని తొందరలో నోటు పుస్తకాలు ఇతర సామాగ్రి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్డబ్ల్యువో రఘురామయ్య హెచ్డబ్ల్యువోలు శ్రీనివాసులు సావిత్రి రమేష్ హాస్టల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర -సుండుపల్లె : అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసినట్లు ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో పలు పాఠశాల విద్యార్థులు హాజరై క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన నూర్జమ ఉదయ్ కిరణ్ వీరికి డిసిసి బ్యాంక్ మేనేజర్ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలను అందజేశారు. వీరికి మొదటి బహుమతి 5000, ద్వితీయ బహుమతి మూడు వేలు, తృతీయ బహుమతి 3000 అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయవరం ప్రధాన ఉపాధ్యాయులు అమృనాయక్, ఉపాధ్యాయులు హరికుమార్, నాగరాజు నాయక్, ఆరిపుల్ల, మణికంఠ, శేఖర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపైన వెళ్లిన ఉపాధ్యాయునికి సన్మానం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: స్థానిక మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు విజయ భాస్కర్ రెడ్డి గత నెలలో జరిగిన బదిలీలలో మైలవరం మండలం దొమ్మర నంద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు . అతనికి నేటి దినం పాఠశాలలో ఘనంగా వీడ్కోలు ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ విజయభాస్కర్ రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో అతడు చేసిన కృషిని ప్రశంసించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ భాస్కర్ రెడ్డి బోధనా పద్ధతులు అందరికీ అనుసరినీయమని అన్నారు. కార్యక్రమంలో ఒకటవ వార్డు కౌన్సిలర్ సుగవాసి ఈశ్వర ప్రసాద్, మాజీ పాటశాల తల్లిదండ్రుల కమిటి చైర్మన్ గిరి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాధులు లేని శరీరం యోగాతో సాధ్యం

డాక్టర్ చంద్రశేఖర్ నాయక్

విశాలాంధ్ర-పీలేరు:-యోగాసనాలు ప్రతిరోజు చేస్తే శరీరానికి మెదడుకు మధ్య ఒక బలమైన బంధమే కాకుండా, వ్యాధులు లేని శరీరం సాధ్యపడుతుందని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలియజేశారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తలుపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు,నిత్యా యోగాసనాలు దాని వలన వ్యక్తికి,శరీరానికి కలిగే లాభాలు గూర్చి అవగాహన మరియు ర్యాలీ కార్యక్రమం డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, హెడ్మాస్టర్ రెడ్డప్ప, ఉపాధ్యాయులు, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఏఎన్ఎం నాగవేణి, సిహెచ్ఓ కుముదా, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళితులకు ఇంటి పట్టాలు మంజూరు చేయకుంటే

రిలే దీక్షలు చేపడతాం:సిపిఐ

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి మండలం చిన్న ఓరంపాడు గ్రామపంచాయతీ పరిధిలోని జ్ఞానంపల్లి అరుంధతివాడ దళితులకు ఇంటి పట్టాలు మంజూరు చేసి ఆదుకోకపోతే తాహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపడతామని సిపిఐ ఓబులవారిపల్లి మండల కార్యదర్శి సి. నాగమ్మ అధికారులకు అల్టిమేటమ్ ఇచ్చారు. బుధవారం ఉదయం తాహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేద దళితులకు ఇంటి స్థలాలు లేక వేరే పక్క ఇంటివారి స్థలాలలో చిన్నపాటి పూరి గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. పక్కింటి వారు ఉండమంటే ఉండాలి, గుడిసె ఖాళీ చేయమంటే ఖాళీ చేసే వేరే చోటికి వెళ్లే దుస్థితి ఏర్పడిందన్నారు. వర్షాల సమయంలో విష పురుగులు గుడిసెల్లోకి వచ్చి ప్రమాదాలు తెచ్చిపెడుతున్నాయన్నారు. అరుంధతివాడలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దారుణం అన్నారు. ఇంటి స్థలాలు కోసం దరఖాస్తులు చేసుకోండి ఇస్తామని రెవిన్యూ అధికారులు చెప్తున్నారే గాని ఇంతవరకు ఇంటి స్థలాలు చూపించలేదన్నారు. పట్టాలు ఇవ్వకుండా కాళ్లు అరిగేలా కార్యాలయాలు చుట్టూ తిప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపేద దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వకుంటే తాసిల్దార్ కార్యాలయం వద్ద ఇల్లు లేని దళిత మహిళలందరూ కలిసి సిపిఐ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. చిన్న ఓరంపాడు శాఖ కార్యదర్శి చిట్వేల్ సరస్వతి, దుర్గా, సునీత, రెడ్డమ్మ తదితరులు నిరసన కార్యక్రమంలో పాల్గొని అనంతరం తాహశీల్దారు పుల్లారెడ్డికి వినతిపత్రం అందజేసి విరమించారు.

రామాపురం ఎంఈఓ-2 గా జయచంద్ర

విశాలాంధ్ర- రామాపురం: మండల విద్యాశాఖ అధికారి 2 గా జయచంద్ర నియమించారు. గాలివీడు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ పదోన్నతి పై రామాపురం మండల విద్యాశాఖాధిగా అధికారి 2 గా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. అనంతరం ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వనాథ్. శంకర్ రెడ్డి. పిచ్చిరెడ్డి. రామచంద్ర. మధుసూదన్ రెడ్డి. గోపికృష్ణ. చంద్రశేఖర్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు

వచ్చేది వైకాపా ప్రభుత్వమే

విశాలాంధ్ర-రామసముద్రం: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైకాపా ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని మదనపల్లి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయి తిప్పారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన రామసముద్రం మండలంలోని కప్పల్లిపంచాయతీ నల్ల చిన్నేపల్లి గ్రామంలో గంగ జాతరకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల ఆధ్యుడు నవరత్నాల సృష్టికర్త ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. దేశంలో ఎక్కడ లేని విధంగా వాలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ గంగాధర్ నాయుడు ఎంపిటిసి విశ్వనాథ్ రెడ్డి తిప్పరాజు రాజన్న అబ్బరాజు చంగప్ప పాల్గొన్నారు.

అన్ని పాఠశాలల్లోనూ డిజిటల్ విద్యా బోధన

విశాలాంధ్ర-మదనపల్లి రూరల్: అన్ని పాఠశాలల్లోనూ డిజిటల్ విద్యా బోధన అమలు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ పురుషోత్తం అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన పాఠశాల లో అమలౌతున్న డిజిటల్ విద్యా బోధనా విధానాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివైఈవో కృష్ణప్ప, హెచ్ఎం సుబ్బారెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

అక్షరాక్షరం అభ్యుదయం విశాలాంధ్ర నైజం

విశాలాంధ్రకు 71 వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

టిడిపి సీనియర్ నాయకులు చమర్తి

విశాలాంధ్ర -రాజంపేట: అక్షరాక్షరం అభ్యుదయం విశాలాంధ్ర దినపత్రిక నైజం అని టిడిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు, ప్రముఖ విద్యావేత్త చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. విశాలాంధ్ర 71 వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యానికి, పాత్రికేయులకు, పాఠకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలాంధ్ర తెలుగు దినపత్రిక 70 వసంతాలను పూర్తిచేసుకుని, 71 వ వసంతంలోకి అడుగెడుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాల గొంతుకగా నిలిచి ప్రజా శ్రేయస్సు కోసం అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. తెలుగుజాతి సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో ఏడు దశాబ్దాలుగా తనదైన ముద్ర వేసిన అక్షర శక్తి విశాలాంధ్ర అన్నారు. కమ్యూనిస్టు భావజాలాన్ని జనం మదిలో నింపి సమ సమాజ నిర్మాణ సాధనకు నిరంతరం నేను సైతం అంటూ అక్షర యజ్ఞం సాగిస్తుందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఎక్కడ అన్యాయం జరిగినా నేనున్నానంటూ ప్రజల పక్షాన నిలిచి పోరాటం సాగిస్తుందన్నారు. ప్రజల కోసం, ప్రజల పక్షాన, ప్రజలే నడుపుతున్న పత్రిక విశాలాంధ్ర దినపత్రిక అన్నారు. రానున్న రోజుల్లో కూడా విశాలాంధ్ర దినపత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

కార్పొరేట్ కళాశాలకు ధీటుగా మహిళా జూనియర్ కళాశాల

విశాలాంధ్ర - రైల్వేకోడూరు: నియోజకవర్గ అసెంబ్లీ కేంద్రం కోడూరు చిట్వేల్ రోడ్డులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలను అధునాతన వసతులతో ప్రారంభించారు. మహిళ విద్యాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మహిళా విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలని మండలంలో అధ్యాపకులు విస్తృత ప్రచారాన్ని చేపట్టారు. 2023- 24 విద్యా సంవత్సరంలో ఎంపిసి, సిఇసి గ్రూపులకు ఇంగ్లీష్ మీడియం లో అత్యుత్తమ బోధన నేర్పించడానికి అపారమైన అనుభవం గల అధ్యాపకులను నియమించారు. తల్లిదండ్రులకు ఫీజులు భారం లేదు, అధునాతన లైబ్రరీ, ల్యాబ్ సౌకర్యం కల్పించారు. ప్రయివేట్ జూనియర్ కళాశాలలో లేని వసతులు ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాలలో మెరుగైన వసతులు కల్పించారు. విద్యార్థినిల భద్రతకు పటిష్టంగా ఏర్పాటు చేశారు. విద్యార్థినిల తల్లిదండ్రులు మహిళా జూనియర్ కళాశాల అభివృద్ధికి సహకరించాలని మహిళా జూనియర్ కళాశాల అధ్యాపకులు కోరారు.

డీఈఓ కార్యాలయం వద్ద ఏబీవీపీ నిరసన

విశాలాంధ్ర-రాయచోటి టౌన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో డీఈఓ కార్యలయం ఎదుట నిరసన తెలియ జేసి డీఈఓ కార్యాలయంలో ఏడీ ప్రసాద్ గారికి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా కన్వీనర్ జేపీ నాగిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని కార్పొరేట్ మరియు ప్రైవేట్ స్కూల్ ఇష్టానుసారంగా వేలాది రూపాయలు వసూలు చేస్తున్నప్పటికీ అనేక సార్లు డీఈఓ గారి దృష్టికి తీసుకెళ్ళినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ డీఈఓ ప్రైవేట్ మరియు కార్పొరేట్ స్కూళ్లకు కొమ్ము కాస్తున్నటువంటి డీఈఓ ని సస్పెండ్ చేయ్యాలి అని అన్నారు. అలాగే డీఈఓ పైన ప్రత్యేకమైన కమిటీ వేసి విచారణ జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నగర అధ్యక్షుడు నందరాజు, నగర ఉప అధ్యక్షుడు ప్రశాంత్ రావ్, శ్రీను, శివశంకర్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

నల్ల గంగమ్మ ఆలయానికి మైక్ సెట్ వితరణ

విశాలాంధ్ర-రాయచోటి టౌన్:భక్తుల కొంగు బంగారం కోరిన కోర్కెలు తీర్చే దేవర రాయి నల్ల గంగమ్మ ఆలయానికి బుధవారం రాయచోటి పట్టణం తిరుపతి నాయుడు కాలనీకి చెందిన అప్పలనేని నాగరాజు నాయుడు కుమార్తె సాహితీ, అల్లుడు హరీష్ లు 20వేల రూపాయలు విలువచేసే మైక్ సెట్‌ను వితరణ చేశారు. దాతలచే ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహింపచేసి, తీర్థ ప్రసాదాలు అందించి , ఆలయ మర్యాదలతో సత్కరించారు. నల్ల గంగమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఈవో కొండారెడ్డి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తపస్య-స్కూల్ లో ఘనంగా యోగాడే వేడుకలు

విశాలాంధ్ర-పీలేరు:- పీలేరులోని సదుం రోడ్డు దొడ్డిపల్లి పంచాయితి తపస్య ఇంటర్ నేషనల్ స్కూల్ నందు యోగా దే పురస్కరించుకొని యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ యోగా గురువు "రాయల లక్ష్మీ సుధాకర్ పాఠశాలకు ముఖ్య అతిథిగా విచ్చేసి పిల్లల చే యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా గురువు రాయల లక్ష్మిల సుధాకర్ పిల్లలకు యోగా ప్రాముఖ్యతను యోగా గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యాసంస్థ చైర్మెన్ వసంత శ్రీపతి రెడ్డి మాట్లాడుతూ భారతదేశం ప్రపంచ దేశాలకు యోగాను పరిచయం చేసి ప్రపంచానికి గురువుగా నిలిచిందన్నారు. తపస్య స్కూల్ నందు ఒక యోగాడే రోజునే కాక ప్రతిరోజు పిల్లలచే యోగా చేయిస్తూ కరికులంలో ఒక భాగం చేశామని అందువలననే తమ పాఠశాల విద్యార్థులు అన్నిరంగాలలో ముందుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొని యోగాసనాలు వేసి కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

ఒడిసా ఉద్యోగుల పోరాట స్ఫూర్తితో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజ్ కోసం పోరాటం సాగించాలి

- ఏపీ లో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి
- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాధాకృష్ణ సాంబశివ

విశాలాంధ్ర-మదనపల్లి రూరల్: ఏపీలోని కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజ్ కోసం ఒడిసా ఉద్యోగుల పోరాట స్ఫూర్తితో పోరాటం సాగించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల రాధాకృష్ణ సాంబశివ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఎల్ నరసింహులు కోరారు. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ బుధవారం మదనపల్లి ఎస్టీయు టివి రెడ్డి భవన్ లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2, 2014 నాటికి ఐదేళ్ళు సర్వీస్, పూర్తి చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ నిర్ణయాన్ని ప్రకటించటాన్ని ఏఐటీయూసీ ఆహ్వానిస్తోందని అయితే రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలు, విద్యుత్, ఆర్టీసి, టూరిజం, హౌసింగ్ వంటి 26 ప్రభుత్వరంగ సంస్థలు, మున్సిపల్, పంచాయితీ వంటి స్థానిక సమగ్రశిక్ష, నేషనల్ ఉపాధిహామీ, వెలుగు తదితర ప్రభుత్వ పథకాలు, యూనివర్శిటీలు, టిటిడి వంటి ధార్మిక సంస్థలలో మూడు లక్షలకు పైగా ఉద్యోగులు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిన అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నారు. వీరే కాక పై శాఖలు, సంస్థలలో 3 దశాబ్దాల నుండి ఎన్ఎంఆర్, డైలీవేస్,కంటింజెంట్, టైంస్కేల్ ఉద్యోగులు పని చేస్తున్నారు. హెల్త్ మిషన్, వీరంతా ఏ నాటికైనా తాము రెగ్యులర్ అవుతామన్న ఆశతో అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అందరిని రెగ్యులరైజ్ చేస్తుం దన్న ఆశతో ఎదురుచూస్తున్న తరుణంలో 2014 జూన్ 2 నాటికి 5 సంలు సర్వీసు పూర్తి చేసుకున్న 6,667 మందిని మాత్రమే రెగ్యులరైజ్ చెయ్యాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీవ్ర ఆందోళనకు, అసంతృప్తికి దారి తీస్తున్నదన్నారు. ఇప్పటికై నా ప్రతిపక్ష నేతగా నాటి అసెంబ్లీలో జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం అందరిని రెగ్యులరైజ్ చేయాలని, సమానపనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,45,000 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, 60,000 మంది కాంట్రాక్టు ఉద్యోగులు అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని అందరినీ రెగ్యులరైజ్ చేయాలని సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్ప ఏపీ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కో కన్వీనర్ సరోజనమ్మ, ఏఐటీయూసీ ఆఫీస్ బేరర్స్ దేవ, సలీం భాష, వేణు గోపాల్ రెడ్డి, తిరుమల,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు,వర ప్రసాద్, గోపాల్, ఇంద్రాణి,బాగ్యమ్మ, క్లాప్ ఆటో డ్రైవర్లు బబ్లూ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచి పోటీ పరీక్షలను ఎదుర్కోవాలి

విశాలాంధ్ర-లక్కిరెడ్డిపల్లి : విద్యార్థి దశ నుంచి అన్ని పోటీ పరీక్షలు పరీక్షలను ఎదురు కోవాలని ఆంధ్ర ప్రగతి బ్యాంక్ మేనేజరు వెంకటేష్ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంకు వారి సౌజన్యంతో అఖిలభారత ఆల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా లక్కిరెడ్డిపల్లి ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు వారి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో మండల స్థాయిలో ఆర్థిక అక్షరాస్యత మీద 8 9 10 తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 10 పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఏపీ మోడల్ స్కూలు చెందిన విద్యార్థులు అగ్రా గీతాంజలి కు రెండో బహుమతి 4000 జానపద జడ్పీ పాఠశాలకు చెందిన రెడ్డి ఫ్యారీ నితీష్ కుమార్ లకు మూడు వేల రూపాయలు మేనేజర్ వెంకటేష్ చేతుల మీదుగా నగదు బహుమతులు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పెంపొందించుకోవాలి. రిజర్వ్ బ్యాంకు వారు ఈ పోటీ పరీక్షలు నిర్వహించారని మండల స్థాయిలో ఎంపికైన వారిని జిల్లా స్థాయిలో మళ్లీ పరీక్ష నిర్వహిస్తారని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి , వెంకటేశ్వర్లు, పురుషోత్తమ రెడ్డి, బ్యాంక్ సిబ్బంది, చంద్రమౌళి, సాయి ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ చొప్పా గంగిరెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర -రాజంపేట: బోయనపల్లిలోని అన్నమా చార్య ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ చొప్పా గంగిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ జన్మదిన వేడుకలలో భాగంగా బుధవారం కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ, ఫార్మశీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ స్వర్ణలత, అకడమిక్ డీన్ డాక్టర్ ఎన్ మల్లికార్జున రావు, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ డాక్టర్ ఎం సుబ్బారావు, పరిపాలన అధికారి నూకా సుబ్బారెడ్డి, డీన్స్, వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది భారీ కేక్ ను కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొని సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ విద్యాప్రధాత అయిన తన సోదరుడు డాక్టర్ చొప్పా గంగిరెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ముందంజలో ఉన్న డాక్టర్ చొప్పా గంగిరెడ్డి ఆయురారాగ్యోలతో, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు.

ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలలో పుస్తకాల దోపిడీని అడ్డుకుంటాం : ఏబీవీపీ

విశాలాంధ్ర -రాజంపేట: ప్రవేట్, కార్పొరేట్ పాఠశాలలో జరుగుతున్న అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం రాజంపేట నగరంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ కడప విభాగ్ కన్వీనర్ కోడూరు మల్లికార్జున మాట్లా డుతూ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో పుస్తకాలు, ఏకరూపదుస్తుల విక్రయా లను అరికట్టడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించకుండా ఎటువంటి అనుమతులు లేకుండా కార్పొరేట్ పాఠశాలలు నగరంలో నడుస్తున్న పట్టించుకోని విద్యాధికారులు ఫీజుల నియంత్రణ కొరకు జిల్లా స్థాయిలో కలెక్టర్, విద్యాశాఖ అధికారులు తల్లితండ్రులు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేయాలని, జిల్లాలో విద్యాహక్కు చట్టం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో రాష్ట్ర పాఠశాల కార్యాలయాన్ని ముట్టడించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా సభ్యురాలు పద్మావతి, నగర మహిళా కన్వీనర్ శ్వేత, అనిల్, నవీన్‌కుమార్, సుస్మిత, రెడ్డమ్మ పాల్గొన్నారు.

బిజెపి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర -రాజంపేట: పట్టణ కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ కార్యా లయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని బిజెపి నాయకులు స్థానిక యువకులతో కలిసి ఘనంగా యోగా దినోత్సవం జరుపుకోవడం జరిగింది. అందరి తో కలిసి యోగ ఆసనాలు సూర్య నమస్కారాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు నంద్యాల పార్లమెంటు జిల్లా ఇన్చార్జి పోతుగుంట రమేష్ నాయుడు మాట్లాడుతూ మనిషిని పరిపూర్ణ ఆరోగ్యవంతుడిగా చేసేది యోగా అని అన్నారు. మన పూర్వీకులు ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగా అని వారన్నారు. ప్రపంచాన్ని మొత్తం ఒకటిగా చేసే ఏకైక సాధనం ఒక్క యోగాకే ఉన్నదని అన్నారు. మనసు తనువు ఆత్మను ఏకం చేసే ఏకాక సాధనం యోగా అన్నారు. ప్రతీ ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగంగా చేసుకుని, శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుతున్నాను అని అన్నారు. కార్యక్రమం అనంతరం బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు తోట నగేష్ అందరికీ బీపీ షుగర్ పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు పట్టుపోగుల ఆదినారాయణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పి సూర్యచంద్ర, బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు తోట నగేష్, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి జీకే నాగరాజు, బిజెపి పట్టణ ఉపాధ్యక్షులు మాకం రవి, బిజెపి నాయకులు టి.హరి ప్రసాద్, బీజేవైఎం నాయకులు అభిరామ్, పత్తిపాటి నవీన్ కుమార్, ప్రవీణ్ కుమార్ యువకులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - రాయచోటి : రాయచోటి మండలం లోని మాధవరం గ్రామపంచాయతీలోని అమృత్ సరోవర్ పథకంలో భాగంగా పని చేసిన చాకలి కుంట వద్ద ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించామని ఏపీ డీవో రవికుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాయచోటి క్లస్టర్ సహాయ పథక సంచాలకులు రవికుమార్ బుధవారం మాట్లాడుతూ యోగా అనేది బౌద్ధమతం ద్వారా ప్రపంచానికే తెలిసిన యోగా ద్వారా అనేక దేశాలలో ఈ యోగా ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందుతూ మానసిక ప్రశాంతతని పొందుతున్నారని మనదేశం ఇది మరుగున పడుతున్న సందర్భం లో మన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఈ రోజు యోగా దినోత్సవ వేడుకల లో పాల్గొని దేశానికే దిశానిర్దేశం చేస్తూ మన దేశంలో కూడా అందరూ యోగా చేస్తూ మంచి ఆరోగ్యాన్ని ప్రశాంతతని పొందాలనిచెబుతున్నట్లు తెలియచేశారు.మాధవరం జిల్లాపరిషత్ హై స్కూల్ పీఇ టీ టీచర్ పాల్గొని యోగా ఆసనాలు ఎలా వెయ్యాలి అనేది ఆసనాలు వేసి చూపించడం జరిగింది .అదనపు కార్యక్రమ అధికారి మురళి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మనసుకు కష్టంగా ఉన్న సమయం లో ఈ యోగా ఆసనాలు ద్వారా మంచి ఉపశమనం పొందవచ్చు అని తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫాహిదా, గ్రామ నాయకులు మహబూబ్ బాషా సాంకేతిక సహాయకులు,క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

విశాఖలో బాలికపై అత్యాచార ఘటనపై సమగ్ర విచారణ చేయాలి

- ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు మర్రి సుమిత్ర

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: విశాఖ జిల్లాలో బాలిక అత్యాచారంపై మహిళపై అత్యాచారాన్ని చేసిన మృగాన్ని కఠినంగా శిక్షించాలని ఆందోళన చేస్తున్న మహిళా కార్యకర్తలపై చేయి చేసుకున్న లేడీ పోలీస్ అధికారి పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మహిళా సమైక్య జిల్లా నాయకురాలు మర్రి సుమిత్ర అన్నారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని పోరాటాలు చేయడం తప్పేంటని ప్రశ్నించారు. నిందితులను గుర్తించి శిక్షించాల్సిన పోలీసులు ఆందోళన చేస్తున్న నిరసనకారులపై దాడి చేయడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని ఎప్పుడు ఏం జరుగుతుందో అని ఒక భయాందోళనలో జీవిస్తున్నారని రక్షణ కల్పించాల్సిన పోలీసు వ్యవస్థ పూర్తిగా విఫలం చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అత్యాచారాలు పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి పట్టణ నాయకురాలు సునీత, అరుణ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: విద్యార్థులకు నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలని మధ్యాహ్న భోజన పథకం ఏడి నరసింహులు తెలిపారు. బుధవారం సంబేపల్లి మోడల్ స్కూల్ ను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న బియ్యం, నాణ్యతను చిక్కి లు, కోడిగుడ్లను పరిశీలించారు. రాగి జావా బుధవారం విద్యార్థులకు ఇచ్చారని అడగగా వారానికి మూడు రోజులు రాగిజావ మూడు రోజులు చిక్కిలు ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు రాగి జావా త్రాగడానికి గ్లాసులు పంపిణీ చేసినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంపై పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర ఆనందమయ జీవితానికి యోగా అవసరం

విశాలాంధ్ర-రాయచోటిటౌన్: ఆరోగ్యకర, ఆనందమయ జీవితానికి ప్రతి ఒక్కరూ యోగాను అలవాటుగా చేసుకోవాలని ఆయుష్ వైద్యులు నూర్ అలీషా, సౌభాగ్యలక్ష్మి, ఖాదర్ బాషా, ఆజాద్ లు అన్నారు.



9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయుష్ శాఖ, సాయి ఇంజనీరింగ్ కళాశాల భాగస్వామ్యంతో నిర్వహించారు. యోగా ఫర్ వసుధైవ కుటుంబకం ఇతివృత్తంతో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, యోగా గురువు సుదర్శన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు యోగాసనాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని ఎదుర్కొనేందుకు పిల్లల నుంచి ప్రతి ఒక్కరూ యోగాను అనుసరించాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చారన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులకు తిరుగులేని మందు యోగా

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : దీర్ఘకాలిక వ్యాధులకు తిరుగులేని మందు యోగా అని యోగా మాస్టర్ శివకుమార్, కళాశాల ఇన్చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ రూప్ బెనర్జీ పేర్కొన్నారు. ప్రతిరోజు యోగా చేయడం వలన ప్రమాదకరమైన రుగ్మతల నుండి బయట పడవచ్చున్నారు.బుధవారం ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా అనంతరాజుపేట హార్టికల్చర్ కళాశాల ఇన్చార్జి అసోసియేట్ ఢీన్ డాక్టర్ రూప్ బెనర్జీ యోగాను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. యోగా ధ్యానం ద్వారా ప్రజల్లో శాంతిని నెలకొల్పవచ్చున్నారు. యోగ గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. యోగాలో చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులు యు రాజేశ్వరి, పి.సదియా, తబుషం, గణేష్‌లకు యోగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె లీలాగోపాల్ చే విలువైన బహుమతులను ప్రధానం చేశారు. యోగా కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్లు స్వరాజ్యలక్ష్మి, సయ్యద్ సదరున్నీసా, కదిరి లలిత, వై దీప్తి, కిరణ్, పిడి రవిశంకర్ బాబు కళాశాల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

విశాలాంధ్ర - రాయచోటి: వీరబల్లె మండలంలో ని పరిధిలోయువత మేల్కొని డ్రగ్స్ రహిత సమాజ ఏర్పాటుకు కృషి చేయాలని సబ్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్డీకేఆర్ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గంజాయి, కొకైన్, హేరయిన్ తదితర మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనము చేసుకుంటున్నారన్నారు. అపరిచిత వ్యక్తులు డ్రగ్స్ అమ్మిన తీసుకున్న టోల్ ఫ్రీ నంబర్14500కు కాల్ చేసి వివరాలు తెలపాలి అన్నారు. ఎస్డీకేఆర్ కళాశాల డైరెక్టర్ రవిశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గంజాయి, గుట్కా కిక్కుతో యువత మునిగి తేలుతున్నారన్నారు.డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని దానికి తోడుగా యువతలో డ్రగ్స్ మహమ్మారి వల్ల కలిగే దుష్పరిణామాలను గురించి అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్డీకేఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి

విశాలాంధ్ర- రామాపురం : మండల పరిధి లోని పాలకొండలో నుంచి, పడదుప్పి గ్రామ శివారులో సమీపానికి పంట పొలాల్లోనే ఉండగా గ్రామ లో ఉన్న కుక్కలు దుప్పిని తరమాడంతో ఆ పొడ దుప్పి దిక్కుతోచక కసిరెడ్డి గారి పల్లి పంచాయతీ ఎల్లారెడ్డి కంకర మిషన్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది నట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రెడ్డప్ప తెలిపారు. రాయచోటి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు మృతి చెందిన పోడదుప్పిని శవ పరీక్ష నిమిత్తం గువ్వల చెరువు పశువుల వైద్యశాలకు తరలించారు. డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి శవ పరీక్ష నిర్వహించారు. శవ పరీక్షా అనంతరం ఫారెస్ట్ శాఖ అధికారులకు అప్పగించినట్లు డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. అనంతరం ఆ పొడ దుప్పిని అటవీ శాఖ పరిధిలోని దహన సంస్కరణలు చేయించడం జరిగిందని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రెడ్డప్ప తెలిపారు.ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ గాయత్రి బేస్ క్యాంప్ సిబ్బంది నాగేష్, గోపాల్. రెడ్డయ్య. తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు

విశాలాంధ్ర-పీలేరు : స్థానిక శ్రీ దివ్య యోగ విద్యాలయం లో9 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు. 6 గంటల నుండి 8 గంటల వరకు ఘనంగా నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు డాక్టర్ పి వి ఎస్ లక్ష్మి శ్రీ సంస్థ న్యాయ సలహాదారులు డాక్టర్ రాయల సుధాకర్ రాయలు పత్రికాముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమ విజయవంతానికి పీలేరు పంచాయతీ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ భాషా తన వంతుసహాయ సహకారాల్ని అందించారని తెలియజేశారు.ఇంటర్నేషనల్ న్యాచురోపతి ఆర్గనైజేషన్ ఆయుష్ శాఖ వాసవి క్లబ్, మెగా వాసవి క్లబ్,వి.ఎస్.ఎన్ విద్యాసంస్థలు భువన విద్యాలయ ఏవిఆర్ స్కూల్ సాధన స్కూల్ ల యాజమాన్యాలు, విద్యార్థిని విద్యార్థులు పట్టణ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా యోగ దే ప్రోటోకాల్ ను అందరితో చేయించడం జరిగినది పట్టణ ప్రముఖ వైద్యులైన డాక్టర్ మమతా లక్ష్మి శ్రీనివాస్ గుప్తా హాస్పిటల్ నుంచి, విజయలక్ష్మి శేషగిరి బాబు విజయ హాస్పిటల్ నుంచి, గ్యారంపల్లి ఆయుర్వేదిక్ డిస్పెన్సరీ నుండి డాక్టర్ శశిరేఖ మెడికల్ ఆఫీసర్ పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోకాటి ఉదయ్ కిరణ్ విద్యాసంస్థల అధినేత్రులు విఎస్ఎన్ మాధవి సాధన వినుత ఏ వి ఆర్ శోభ ప్రకాష్ లో పాల్గొ నారు రాజకీయ రంగం నుండి జిల్లా మహిళా అధ్యక్షురాలు మహిత ఆనంద్ మరియు వైస్ ఎంపీపీ పీలేరు మండలం నెల్లూరు వెంకటాచలపతి పాల్గొన్నారు. చిన్మయ మిషన్ మేడం వారి పల్లి నుండి కృష్ణానంద స్వామి అమూల్యమైన ప్రసంగాన్ని ఇవ్వడం జరిగింది అందులో భాగంగా భగవద్గీతలో ఉన్నటువంటి యోగాంశాలను గురించి కర్మ సిద్ధాంతాన్ని యోగ ద్వారా అందరూ పాటించాలని తెలియజేశారు డాక్టర్లు మాట్లాడుతూ యోగము కూడా ఈరోజు వైద్య విధానంలో భాగంగా ఉన్నదని యోగా ద్వారా అనేక రకాల జబ్బులకు ఈరోజు పరిష్కారం దొరుకుతుందని తెలియజేశారు ప్రతి ఒక్కరూ రోజు యోగ సాధన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు విద్యాసంస్థల అధినేత్రులు మాట్లాడు

తూ ఈరోజు అన్ని పాఠశాలల్లో శ్రీ దివ్య యోగ విద్యాలయం వారి ద్వారా యోగ విద్యను అందుకుంటున్న అందుకు ఆనందంగా ఉందని తెలియజేశారు. వాసవి క్లబ్ గ్రేటర్ వాసవి క్లబ్ ద్వారా అరవిందు వారి బృందం పాల్గొని యోగ గొప్పతనాన్ని తెలియజేశారు ఈ కార్యక్రమంలో మే నెలలో జరిగిన సమ్మర్ క్యాంపు లో పాల్గొనిన విద్యార్థిని విద్యార్థులకు ఫోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారి అందజేసినటువంటి యోగా సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. నిర్వాహకులు లక్ష్మీ సుధాకర్ మాట్లాడుతూ తమ యోగా సెంటర్ ద్వారా మేలైన ఇంత ఎక్కువ మందికి యోగ విద్యను అందించి అందరినీ ఆరోగ్యవంతులుగా చేసే విధానంలో యోగ ఇన్స్ట్రక్టర్ కోర్స్ ను కూడా ప్రారంభించామని అవసరమైన వారు సంప్రదించవలసిందిగా కోరారని తెలియజేశారు.గత 22 సంవత్సరాలుగా యోగ సంఘంలో విశిష్ట సేవలను రాష్ట్రవ్యాప్తంగా అందజేస్తున్నటువంటి రాయల దంపతులకు పుర ప్రముఖులు ఘనంగా సన్మానం చేశారు.

విశాలాంధ్ర -సుండుపల్లె : అంతర్జాతీయ యోగ దినోత్సవము సచివాలయంలో ఈవోపీఆర్డి సురేష్‌బాబు, పంచాయతీ సెక్రెటరీ మర్రిపాటి సురేష్ బాబులు యోగా ఆసనాలను ఘనంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 21 న జరుపుకుంటారు. 2014 సెప్టెంబరు 27న భారత ప్రధాని నరేంద్రమోడి ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకొనుట గురించి ప్రతిపాదన చేశారని ఈ తీర్మానానికి 193 ఐరాస ప్రతినిధులలో 175 మంది మద్దతు ఇచ్చారని ఎప్పటి నుండి ప్రతి ఏడాది ఉంచుకోవడం జరుగుతుందన్నారు. సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు యోగా ప్రదర్శించారు.

గిరిజన యానాది భూములకు అగ్రవర్ణాల ఆటంకం

- గిరిజన యానాది సేవా సంఘం నాయకుల సమక్షంలో హద్దులు ఏర్పాటు చేసిన రెవెన్యూ సిబ్బంది

విశాలాంధ్ర-పీలేరు: గిరిజన యానాది భూములకు అగ్రవర్ణాల ఆటంకం కలిగిస్తున్న నేపథ్యంలోగిరిజన యానాది సేవా సంఘం నాయకుల సమక్షంలో రెవెన్యూ సిబ్బంది హద్దులు ఏర్పాటు చేశారు.కెవి పల్లి మండలం, మారేళ్ల పంచాయతీ, మంచాలమంద సమీపంలో 1983 సంవత్సరంలో అప్పటి తహసిల్దార్ వెంకట సుబ్బారెడ్డి గిరిజన యానాదులైన సిద్దయ్య,వెంకటయ్య, పాపయ్య కుటుంబాలకు జీవనోపాధికి సాగు కోసం సర్వే నెం.1516/1, 1516/2, 1517 భూమి లో 10.5 ఎకరాలు ప్రభుత్వ భూమిని గిరిజన యానాదులకు పంపిణీ చేయడమైనది. కానీ సాగు చేసుకొనే ప్రయత్నంలో ప్రతిసారి అక్కడ నివసిస్తున్న కొంతమంది అగ్రకులస్తులు గిరిజనులకు అడ్డు తగులుతుండడంతో గిరిజన యానాదులకు అగ్రకులస్తులకు గొడవ జరిగేది. ఇటీవల మళ్ళీ వారు అడ్డు తగలడంతో గిరిజన యానాదులు తాసిల్దార్ కు వినతి పత్రం సమర్పించిన నేపథ్యంలో తహసిల్దార్ ఆదేశాల మేరకు వీఆర్ఓ దీనా వీఆర్ఏ, సర్వేయర్ లతో కలిసి, ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సంఘం నాయకుల సమక్షంలో మంగళవారం సరిహద్దు రాళ్లు నాటడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు పులి శ్రీనివాసులు మాట్లాడు తూ 10.5 ఎకరాలకు సంబం ధించి గిరిజన యానాదులకు పట్టాలు కూడా ఉన్నాయని వారు సాగు చేసుకునేందుకు అగ్రవర్ణాలు ఎటువంటి ఆటంకం కలిగించిన రెవెన్యూ పోలీస్ అధికారులు తక్షణం వారిపై చర్య తీసుకోవాలని అన్నారు. అధికారులు అగ్రవర్ణాల నుండి గిరిజన యానాదులకు రక్షణ కల్పించాలని అధికారులను కోరారు. వారికి ఎటువంటి హాని జరిగినా గిరిజన యానాది సేవా సంఘం ఊరుకోదని హెచ్చరించారు. పై కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గద్దం శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులు జానం గంగిరెడ్డి, చుక్కలపాటి ఆదినారాయణ, జి.సిద్దు,నారాయణమ్మ, యువ నాయకులు లోకేష్ సుబ్రహ్మణ్యం గోవిందు, వైసిపి నాయకులు వెంకటరమణ నాయుడు, కొండప్ప నాయుడు, శ్రీనివాసులు రెడ్డి, వై.వి పాలెం మాజీ ఎంపీపీ ఓబులేసు,ఈరం రెడ్డి, వీఆర్వో దీనా, వీఆర్ఏ, సర్వేయర్ పాల్గొన్నారు.

కాపుల సమాజిక వర్గాన్ని తాకట్టు పెట్టే ముద్రగడ పవన్ పై విమర్శలా?

విశాలాంధ్ర-పీలేరు: కాపు జాతిని తాకట్టు పెట్టే ముద్రగడ తమ నేత పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేయడం హాస్యపదం గా ఉందని పీలేరు నియోజకవర్గం జనసేన నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి కలప రవి అన్నారు. ఈ సందర్భంగా రవి మాటలాడుతు ముద్రగడ, పవన్ కళ్యాణ్ రాసిన లేఖ పై స్పందిస్తూ,ముద్ర రెడ్డి అనే పేరు కోసం ఇన్నాళ్లు పాటు పడిన పెద్దాయన అని చెప్పుకునే తిరిగే నికు...పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడే హక్కు శాశ్వతంగా కోల్పోయారని అన్నారు.కాపు జాతిని తాకట్టు పెట్టేఎవరైనా సరే దీనికి అర్హులు అండి..మీకు కాలం చెల్లిపోయిందని అన్నారు.కాపు ఆడబడుచులని ,పవన్ కళ్యాణ్ ఫ్యామిలీ నీ తిట్టినప్పుడు ఎక్కడ వున్నారని అన్నారు..మీరుఈ రోజు ఒక రెడ్డి కి కౌంటర్ ఇస్తే సిగ్గు లేకుండా లెటర్ రిలీజ్ చేస్తారా,దీనిని జనసేన పార్టీ, పీలేరు నియోజకవర్గం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. పీలేరు నియోజకవర్గం జనసేన నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి కలప రవి, మండల అధ్యక్షులు మోహన్ కృష్ణ, ప్రధాన కార్యదర్శులు పవన్, గజేంద్ర, కార్యదర్శులు హరీష్, నవీన్, దిలీప్ మాట్లా డారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కలపరవి సంయుక్తంగా మాటలాడుతు ఈ వయసులో కనీసం మంచి చేయక పోయినా పర్వాలేదుగాని 8 పదుల వయసులో శ్రీ చేగొండి హరిరామజోగయ్య చూసి అయిన మీకూ బుద్ది రావాలని కోరుకుంటున్నామని తెలిపారు.అండి.మండల అధ్యక్షులు మోహన్ కృష్ణ మాట్లాడుతూ " వారాహి యాత్ర విజయవంతం కావడం వల్లే, జగన్ దర్శకత్వం లో ముద్రగడ ఒక పైడ్ ఆర్టిస్ట్ లా పవన్ కళ్యాణ్ లేఖ రాశారని, డైవర్షన్ పాలిటిక్స్ కి తెరతీసారన్నారు.



ఘనంగా యోగా దినోత్సవం

విశాలాంధ్ర-పీలేరు: గ్యారంపల్లి ఆంధ్రప్రదేశ్ గురుకుల జూనియర్ కళాశాలలో విద్యార్థులందరికీ యోగా దినోత్సవ సందర్భంగా యోగా సనాలు, సూర్య నమస్కా రాలు, యోగ ముద్రలు, ప్రాణా యామం విద్యార్థులతో గిన్నిస్ బుక్ ప్రపంచ గిన్నిస్ బుక్ రికార్డ్ విజేత డాక్టర్ మేజారి మల్లికార్జున చేయిం చారు. విద్యార్థులకు యోగా సాధన చేయించిన మల్లికార్జునకు శాలువా, మెమొంటోలతో ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు, అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా గ్యారంపల్లి ఎంపీటీసీ సభ్యులు సూర్యనారాయణ రెడ్డి హాజరై పిల్లలకు విద్యార్థి దశనుండే యోగ సాధన నేర్పించుటవలన ఏకాగ్రత, సత్ప్రవర్తన, సత్ సాంగత్యం, ఆత్మవిశ్వాసం చక్కటి శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తాయని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపాల్ భూపతి అధ్యాపకులు రామకృష్ణ ఆంజనేయులు, రమాదేవి, అన్నపూర్ణ, వెంకటరమణ,హరి, మస్తానవల్లి, కొండయ్య, బలరాం, రామకృష్ణ, సౌజన్య, మౌనిక మొదలగు వారు పాల్గొన్నారు.

ఒడ్డెర విద్యార్థిపై హత్యాయత్నం అమానుషం

అన్నమయ్య జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు సి. మల్లికార్జున

విశాలాంధ్ర-గాలివీడు: మదనపల్లెకు చెందిన ఒడ్డెర విద్యార్థి ఆదిమూర్తి పై జరిగిన హత్యాయత్నాన్ని అన్నమయ్య జిల్లా బీ.సి సంఘం అధ్యక్షుడు మల్లికార్జున తీవ్రంగా ఖండించారు.బాధితుడి స్నేహితుని బర్త్ డే పార్టీ పేరుతో నమ్మించి సి.టి.ఎం లోని నిర్మానుష ప్రాంతానికి పిలిపించిన ఐదుగురు రౌడీమూక పథకం ప్రకారం హత్య చేయడానికి కర్రలతో, ఇనుప చువ్వలతో మూకుమ్మడిగా దాడిచేశారన్నారు. అందులో ఒకరు దాడి చేస్తున్న సంఘటనను సెల్ ఫోన్లో చిత్రీకరించారన్నారు.చావుభయంతో బాధితుడు కాపాడండని అరుస్తూ ఎలాగోలా వారినుండి తప్పించుకొని తన తల్లితో కలిసి పోలీసులను ఆశ్రయించా రన్నారు. బరితెగించిన రౌడీ మూకలను కఠినంగా శిక్షించకుండా వదిలేస్తే ఎంతటి ఘాతుకానికైనా వెనుకాడరని అన్నారు.ఈ సంఘటనపై జిల్లాస్థాయి పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి నిందితులకు కఠినమైన శిక్షపడేలా చూడాలన్నారు. బాధితుని పక్షాన స్పందించి దగ్గరుండి మేమున్నా మంటూ వెన్నుదన్నుగా నిలిచిన కుల పెద్దలకు వారు ధన్యవాదాలు తెలియజేశారు.రాష్ట్రమంతటా కులసంఘ నాయకులు బాధితునికి అండగా నిలబడి స్పందించిన తీరు అభినం దనీయమని కొనియాడారు.

అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలి

ఐఎఫ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శెట్టిపల్లి సాయికుమార్

విశాలాంధ్ర - రాయచోటి : రాయచోటి సంబేపల్లి మండలం దేవపట్లలో ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకళాదేవి పాఠశాల సమయంలో స్కూల్‌లో వుండకుండా ప్రిన్సిపాల్ నివాసము ఒకే చోట ఉండడంతో ఇంటికి వెళ్లి సేద తీరుతున్నది. ఎవరైనా అధికారులు వస్తే పాఠశాలకు వస్తున్నారు ఎవరూ రాకపోతే బయోమెట్రిక్ సమయానికి పాఠశాలకు వచ్చి బయోమెట్రిక్ వేసి వెంటనే తన నివాసానికి వెళ్తున్నారు ఎవరైనా పదో తరగతి అయిపోయిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు టీసీలు స్టడీ సర్టిఫికెట్లు కావాలని పాఠశాలల దగ్గరికి తల్లిదండ్రులు వస్తే వారిని గంటలు తరపడి సమయాన్ని వృధా చేయడమే కాకుండా వారిని అగౌరపరచడం జరుగుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మేము కూలి పనులు చేసుకుంటూ ఉండేవారము మేము రోజు స్కూల్ చుట్టూ తిరగాలంటే సాధ్యపడదని తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ మేడం తో ప్రాధేయపడగా వారి పట్ల ఇష్టం వచ్చినట్లు కులం పేరుతో దూషించడం జరిగిందన్నారు. వెంటనే ప్రిన్సిపాల్ శ్రీ కళాదేవి పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని ఐఎఫ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సాయికుమార్ డిమాండ్ చేశారు. అక్కడ జరిగినటువంటి పరిణామాలు పైన సమగ్ర విచారణ జరిపి ప్రిన్సిపాల్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. అక్కడ ఉన్న పాఠశాల సిబ్బంది ఏ మాత్రం పట్టించుకోకుండా ఒకరి మీద ఒకరు చెప్పుకుంటూ చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలన ఇష్టానుసారంగా టీచర్లు వ్యవహరిస్తున్నారు. ఇక్కడ మిడ్ డే మీల్స్ కూడా విద్యార్థులకు మెనూ సక్రమంగా పాటించకుండా అడిగేవాడే లేదు అనే ఉద్దేశంతో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారు. వీటన్నింటి పైన సమగ్ర విచారణ జరిపి వారి పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ నాయకులు భాను, శివతేజ, వెంకీ, పాల్గొన్నారు.

శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో యోగా దినోత్సవం

విశాలాంధ్ర - రాయచోటి : రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుష్ శాఖ మరియు జిల్లా క్రీడల అభివృద్ధి ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నాడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల నుండి అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ వాసవి యోగ శిక్షణ సంస్థ వ్యవస్థాపకులు కూనా కృష్ణదేవరాయలు, జిల్లా క్రీడల అభివృద్ధి సంస్థ చీఫ్ ఎస్ కే. షఫీ ప్రోత్సాహంతో మూడు రోజుల నుండి కళాశాలలో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తూ అభ్యర్థులకు ధ్రువపత్రాలు ప్రధానం చేస్తున్నామని తెలియజేశారు.భారత ఉపనిషత్తులు, వేదాలు ఆయుర్వేద వైద్యశాస్త్రంలో యోగా విశిష్టతను తెలియజేశాయని కావున ప్రపంచంలోనే యోగకు పేటెంట్ హక్కులు సాధించిన ఘనత భారతదేశానికి దక్కుతుందని తెలియజేశారు. ఆయుష్ శాఖ అధికారి డాక్టర్. నూరుల్లా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటికి యోగా ధ్యాన కేంద్రాన్ని మంజూరు చేసిందని తెలియజేశారు. యోగా విన్యాసాల వలన దీర్ఘకాలిక వ్యాధి సమస్యలు, రక్తప్రసరన, శ్వాస సంబంధిత వ్యాధులు నయం అవుతాయి అని యోగ మాస్టర్ లయన్ సుదర్శన్ వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.